# నూత్న నిబంధన కథలు

సంపాదకుడు :
**ఫాదర్ పి. జోజయ్య, S.J.**
ఆంధ్ర లొయోలా కాలేజి
విజయవాడ - 520 008
ఫోను - (0866)-2476329

# మనవిమాట

పూర్వనిబంధన కథలను ఇదివరకే ప్రచురించాం. ఈ పుస్తకం దానికి అనుసరణం.

ఈ గ్రంథం ప్రధానంగా పిల్లలకు నూత్న నిబంధన జ్ఞానాన్ని అలవర్చడానికి ఉద్దేశింపబడింది. ఐనా యిది పెద్దలకు కూడ ఉపయోగ పడుతుంది.

ప్రతి కథకు ఆలోకనం ఇచ్చాం. ఒక్కో కథ చదివిన తర్వాత నూత్న నిబంధనం నుండి కూడ ఆలోకనాన్ని నేరుగా చదువుకోవాలి. దీని వలన బైబులు జ్ఞానం అలవడుతుంది.

ఈ కథలను వట్టినే చదువుకొనిపోతే చాలదు. ఇవి బోధించే నీతులను జీవితంలో పాటించాలి. బైబులు మంచి ప్రవర్తనను నేర్పే గ్రంథం.

ఈ పుస్తకం మన ప్రజల్లో బైబులు జ్ఞానాన్ని కొలదిగానైనా పెంచుతుందని ఆశిస్తున్నాం. ఈ గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయాన్ని అందించిన రెవ.డోక్టరు ఇంజే పౌలు గారికి మా కృతజ్ఞతలు.

– గ్రంథకర్త

# విషయ సూచిక


1. గబ్రియేలు యోహాను జననాన్ని ఎరిగించడం
2. యేసు జననాన్ని ఎరిగించడం
3. మరియ యెలిసబేతును సందర్శించడం
4. స్నాపక యోహాను జననం
5. క్రీస్తు జననం
6. గొర్రెల కాపరుల సందర్శనం
7. దేవాలయంలో శిశువు సమర్పణం
8. జ్ఞానులు శిశువుని సందర్శించడం
9. హేరోదు పసిబిడ్డలను చంపించడం
10. దేవాలయంలో యేసు
11. యోహాను బోధ
12. క్రీస్తు జ్ఞానస్నానం, శోధనలు
13. మొదటి ఐదుగురు శిష్యులు
14. పర్వత ప్రసంగం
15. నీటిని ద్రాక్షరసంగా మార్చడం
16. దేవాలయాన్ని శుద్ధిచేయడం
17. నికొదేము
18. సమరయ స్త్రీ
19. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీ
20. నజరేతులో క్రీస్తుబోధ
21. రోగులకు స్వస్థత
22. శిష్యులకు పిలుపు
23. పక్షవాత రోగికి ఆరోగ్యం
24. శతాధిపతి సేవకునికి ఆరోగ్యం
25. నాయీను వితంతువు కుమారుడు
26. స్నాపక యోహాను దూతలు
27. సీమోను ఇంటిలో పాపాత్మురాలు
28. దీర్ఘకాలరోగికి ఆరోగ్యం
29. మత్తయికి పిలుపు
30. విత్తేవాని ఉపమానం
31. గోదుమ పైరులో కలుపుమొక్కలు
32. తుఫానుని ఆపడం
33. రక్తస్రావరోగి, చనిపోయిన బాలిక
34. ఊచచేతివానికి ఆరోగ్యం
35. పండ్రెండుమంది శిష్యులు
36. స్నాపక యోహాను మరణం
37. ఐదువేలమందికి ఆహారం
38. నీటిపై నడవడం
39. కననీయ స్త్రీ విశ్వాసం
40. పేతురుకు ప్రధానాధికారం
41. దివ్యరూపధారణం
42. చేప నోటిలో నాణెం
43. గొప్పవాడు ఎవడు?
44. చిన్నబిడ్డలను దీవించడం
45. తోడివారిని క్షమించాలి
46. నడుము వంగిన స్త్రీ
47. మంచి సమరయుడు
48. జక్కయ
49. బర్తిమయి
50. మరియా మార్తలు
51. ద్రాక్షతోట ఉపమానం

52. మంచి కాపరి
53. తప్పిపోయిన కుమారుడు
54. పుట్టుగ్రుడ్డికి చూపు
55. అవివేకియైన ధనికుడు
56. కాయలు కాయని అంజూరం
57. పదిమంది కుష్ఠరోగులు
58. పరిసయుడు, సుంకరి
59. ధనిక యువకుడు
60. ద్రాక్షతోటలో కూలీలు
61. లాజరుని జీవంతో లేపడం
62. మరియ క్రీస్తుకి అభిషేకం చేయడం
63. క్రీస్తు యెరూషలేము ప్రవేశించడం
64. వివాహపు విందు
65. సీజరుకు పన్ను
66. వితంతువు కానుక
67. పదిమంది కన్నెలు
68. ముగ్గురు సేవకులు
69. తుది తీర్పు
70. శిష్యుల కాళ్లు కడగడం
71. దివ్యసత్ప్రసాద స్థాపనం
72. యూదా ద్రోహం
73. యూదా ద్రోహాన్ని ఎరిగించడం
74. గెత్సెమనిలో ఆవేదనం
75. యేసుని బంధించడం
76. న్యాయపీఠం ఎదుట యేసు
77. పేతురు బొంకు
78. పిలాతు మరణ శిక్ష విధించడం
79. యేసు సిలువను మోయడం
80. యేసు భూస్థాపనం
81. యేసు ఉత్థానం
82. పేతురు, యోహాను సమాధిని దర్శించడం
83. మగ్దల మరియకు దర్శనం
84. ఎమ్మావు శిష్యులకు దర్శనం
85. యెరూషలేములో దర్శనం
86. సరస్సు తీరాన దర్శనం
87. పేతురుకు ఆదేశం
88. మోక్షారోహణం
89. మత్తీయ ఎన్నిక
90. పెంతెకోస్తు
91. కుంటివానికి స్వస్థత
92. అననీయ సఫీరాల కథ
93. అపోస్తలులకు శ్రమలు
94. ఏడ్గురు సహాయకులు
95. స్తెఫను మరణం
96. సౌలు క్రైస్తవులను హింసించడం
97. ఫిలిప్పు, ఇతియోపియా ఉద్యోగి
98. సౌలు మార్పు చెందడం
99. గంపలో సౌలు
100. పేతురు తబితను జీవంతో లేపడం
101. కొర్నేలి పరివర్తనం
102. చెరలో పేతురు
103. పౌలు మొదటి ప్రేషిత యాత్ర
104. యెరూషలేము మహాసభ
105. రెండవ ప్రేషిత యాత్ర
106. మూడవ ప్రేషిత యాత్ర
107. అగబు ప్రవక్త
108. పౌలు చరమదశ

# నూత్న నిబంధన కథలు

## 1. గబ్రియేలు యోహాను జననాన్ని ఎరిగించడం - లూకా 1,5-25

హేరోదు పరిపాలనా కాలంలో యూదియా రాష్ట్రంలో జెకర్యా అనే యాజకుడు ఉండేవాడు. అతని భార్య ఎలిసబేతు. వాళ్లు భక్తితో జీవించేవాళ్లు. ఐనా సంతానం లేకపోవడం వారికి పెద్ద బాధ ఐంది. ఇద్దరూ వృద్ధులు. ఒకనాడు జెకర్యా దేవాలయంలో పీఠంమీద దేవునికి సాంబ్రాణి పొగ వేస్తుండగా దేవదూత దర్శనమిచ్చాడు. అతడు జెకర్యా! దేవుడు నీ మొరాలించాడు. నీ భార్య గర్భం ధరించి కుమారుని కంటుంది. అతనికి యోహాను అని పేరు పెట్టాలి. అతడు నాజరేయ వ్రతాన్ని పాటించి దేవునికి సేవలు చేస్తాడు అని చెప్పాడు.

జెకర్యా అయ్యా! మేమిద్దరం వృద్ధులం. మాకు బిడ్డడు ఎలా కలుగుతాడు అని అడిగాడు. దేవదూత నా పేరు గబ్రియేలు. నేను దేవుని సన్నిధిలో సేవలు చేసేవాణ్ణి. ప్రభువే నన్ను నీ దగ్గరికి పంపాడు. నీవు దేవుని సందేశాన్ని నమ్మలేదు కనుక బిడ్డడు పుట్టేవరకు మూగవాడివిగా వుంటావు అని పల్కి అదృశ్యమయ్యాడు.

ఇంతలో ప్రజలు దేవళం వెలుపల జకర్యా కొరకు వేచివున్నారు. అతడు జనం దగ్గరికి వచ్చినపుడు వారితో మాటలాడలేక సైగలు చేశాడు. ప్రజలు అతనికి దేవళంలో దైవదర్శనం కలిగిందని గ్రహించారు. అటు పిమ్మట జకర్యా ఇంటికి వెళ్లిపోయాడు. దేవదూత చెప్పినట్లే యెలిసబేతు గర్భం ధరించింది.

## 2. గబ్రియేలు యేసు జననాన్ని ఎరిగించడం - లూక 1,26-38

ఆరునెలలు గడిచాక గబ్రియేలు గలిలయ రాష్ట్రంలోని నజరేతు గ్రామంలో వసించే మరియ అనే కన్యదగ్గరికి వచ్చాడు. ఆమెను దావీదు

వంశస్థుడైన యోసేపుకి ప్రదానం చేశారు. దేవదూత అమ్మా! నీవు దేవుని అనుగ్రహానికి నోచుకున్నావు. ప్రభువు నీకు తోడుగా వుంటాడు. నీకు శుభం అని పల్కాడు. మరియ భయపడి దూత సందేశం భావం ఏమిటా అని ఆలోచిస్తుండగా అతడు అమ్మా! భయపడకు. నీవు గర్భందాల్చి కుమారుని కంటావు. అతనికి యేసు అని పేరుపెట్టాలి. అతన్ని దేవుని కుమారుడు అని పిలుస్తారు. దేవుడు దావీదు సింహాసనాన్ని అతనికి దయచేస్తాడు అని చెప్పాడు.

మరియ నేను కన్యను గదా! నాకు బిడ్డడు ఏలాపుడతాడు అని అడిగింది. గబ్రియేలు ఆ శిశువు పవిత్రాత్మ శక్తివలన జన్మిస్తాడు. కనుక అతన్ని దేవుని కుమారుడు అని పిలుస్తారు. నీ బంధువు ఎలిసబేతు ఉంది కదా! గొడ్రాలుగా వుండిపోయిన ఆమె ఆరునెలల క్రితమే గర్భం ధరించింది. ఈ కార్యం దేవుని శక్తి వలన జరిగింది సుమా అని చెప్పాడు.

ఆ పలుకులు విని మరియ ఇదిగో! నేను ప్రభువు దాసురాలిని. నీవు చెప్పినట్లే జరగనీయి అని తన సమ్మతిని తెలియజేసింది. అంతట దేవదూత మరుగైపోయాడు.

అదే గ్రామంలో వసించే యోసేపుకు దేవుడు మరియను కరుణించాడని తెలియదు. కనుక ప్రభువు దూత అతనికి కలలో కన్పించి దావీదు వంశస్థుడైన యోసేపూ! నీవు మరియను చేపట్టడానికి సందేహించ వద్దు. ఆమె పవిత్రాత్మ శక్తి వలన గర్భం ధరించింది. ఆమెకు పుట్టబోయే శిశువుకి యేసు అని పేరు పెట్టాలి. అతడు ప్రజలను పాపం నుండి రక్షిస్తాడు అని చెప్పాడు - మత్త 1,20-21

## 3. మరియ ఎలిసబేతుని సందర్శించడం- లూకా1,39-45

దూత సందేశాన్ని విన్న తర్వాత మరియ ప్రయాణమై గబగబ యెలిసబేతు ఇంటికి వెళ్లి ఆమెను అభినందించింది. ఆమె పలుకులు వినగానే ఎలిసబేతు గర్భంలోని శిశువు ఆనందంతో కదిలాడాడు. ఎలిసబేతు ఆత్మ

ప్రేరణం వలన అమ్మా! నీవు స్త్రీలందరిలోను ధన్యురాలివి. నీకు పుట్టబోయే శిశువు దీవెనలు పొందుతాడు. నా ప్రభువు తల్లి నన్ను సందర్శించడానికి రావడం ఎంత భాగ్యం! ప్రభువు సందేశాన్ని శంకించక నమ్మిన నీవు చాల యోగ్యురాలివి కదా అని పల్కింది. దేవుడు తన్ను కరుణించినందుకు మరియ కూడ అతన్ని స్తుతించింది.

## 4. యోహాను జననం - లూకా 1,59-65

దేవదూత చెప్పినట్లే యెలిసబేతు కుమారుని కంది. బిడ్డడు పుట్టినందుకు ఇరుగుపొరుగువాళ్లు ఆనందించారు. ఎన్మిదవనాడు శిశువుకి సున్నతి చేసి జెకర్యా అని పేరు పెట్టబోయారు. కాని తల్లి అతనికి యోహాను అనే పేరు పెట్టాలని చెప్పింది. కుమారునికి ఏమి పేరు పెట్టమంటావని తండ్రిని అడగ్గా అతడు మాటలాడలేక పలకమీద యోహాను అని వ్రాసి యిచ్చాడు. కనుక బిడ్డడికి ఆ పేరే పెట్టారు. వెంటనే జకర్యా నాలుక పట్టు సడలగా అతడు దేవుణ్ణి స్తుతించాడు. అద్భుతంగా పుట్టిన ఆ బిడ్డడు తర్వాత ఎంత గొప్పవాడు ఔతాడో గదా అని ప్రజలు విస్తుపోయారు.

## 5. యేసు జననం - లూకా 2,1-7

ఆ రోజుల్లో అగుస్తు చక్రవర్తి జనాభా లెక్కలు సేకరించమని అధికారులను ఆజ్ఞాపించాడు. కనుక పేర్లు నమోదు చేయించు కోవడానికి ప్రజలందరు తమతమ పూర్వ పట్టణాలకు వెళ్లారు. యోసేపు దావీదు వంశస్థుడు కదా! కనుక అతడు దావీదు నగరమైన బేత్లెహేముకి తనకు ప్రదానం చేయబడిన మరియతోపాటు వెళ్లాడు. ఆమె పూర్ణ గర్భవతి. చాలమంది జనం పేర్లు వ్రాయించుకోవడానికి వచ్చినందున వారికి ఆ వూరి సత్రంలో చోటు దొరకలేదు. అక్కడే మరియ తొలిచూలు కుమారుణ్ణి కని పొత్తిగుడ్డల్లో చుట్టి పశువులకు మేతవేసే రాతి తొట్టిలోనే పరుండ బెట్టింది. ఆలా దేవాధిదేవుడు ఓ పేదనరుడుగా జన్మించాడు.

## 6. గొర్రెల కాపరుల సందర్శనం -లూకా 2,8-19

బేత్లెహేము దరిదాపుల్లో రాత్రిపూట గొర్రెల కాపరులు మందలకు కాపలా కాస్తున్నారు. దేవదూత వారికి దర్శనమిచ్చాడు. అక్కడ పెద్ద వెలుగు ప్రకాశించింది. దూత వారితో మీరు మీరు భయపడకండి. నేడు దావీదు నగరమైన బేత్లెహేములో రక్షకుడైన క్రీస్తు పుట్టాడు. పొత్తిగుడ్డల్లో చుట్టబడి వున్న శిశువు మీకు పశువుల తొట్టిలో కన్పిస్తాడు అని చెప్పాడు. అంతలోనే పెద్ద దేవదూతల సమూహం కూడ కన్పించి దేవుణ్ణి స్తుతించింది. కాపరులు ఉత్సాహంతో బేత్లెహేమువచ్చి దూత చెప్పినట్లుగానే తొట్టిలో పరుండి వున్న శిశువుని చూచి సంతోషించారు. ఇరుగు పొరుగు వాళ్లకు కూడ ఈ సమాచారం తెలియజేయగా వాళ్లు ఆశ్చర్యపోయారు. తల్లి మరియ ఈ సంగతులన్నీ హృదయంలో దాచుకొని వాటిని గూర్చి లోతుగా ఆలోచిస్తూ ఉంది.

## 7. దేవాలయంలో శిశువు సమర్పణం - లూకా 2,22-40

40 రోజుల తర్వాత తల్లిదండ్రులు యేసు శిశువుని దేవునికి సమర్పించడానికి యెరూషలేము దేవాలయానికి తీసికొని వచ్చారు. రెండు గువ్వలను గూడ కానుకగా కొనివచ్చారు. ఆ రోజుల్లో యెరూషలేములో సుమియోను అనే భక్తుడు ఉండేవాడు. అతడు మెస్సీయా రాకడకొరకు కనిపెట్టుకొని వున్నాడు. పవిత్రాత్ముడు నీవు మెస్సీయాను కంటితో చూచినదాక బ్రతికి వుంటావని అతనికి వరమిచ్చాడు. ఆత్మ ప్రేరితుడై సుమియోను దేవళానికి వచ్చి బాలుని చేతుల్లోకి తీసికొని నేడు నేను ప్రభువు రక్షణాన్ని కన్నులార చూచాను గదా అని దేవుణ్ణి స్తుతించాడు. ఇంకా అతడు మరియతో ఈ బాలుని వలన కొందరికి రక్షణమూ, కొందరికి శిక్షా ప్రాప్తిస్తాయి. ఇతని వలన నీ హృదయానికి కూడ గొప్ప వేదన కలుగుతుంది అని ప్రవచించాడు.

అదే సమయంలో అన్నా అనే భక్తురాలు కూడ దేవాలయానికి వచ్చింది. ఆమె మెస్సీయా రాకడ కొరకు కాచుకొనివున్న వాళ్లందరికీ ఆ బాలుణ్ణి చూపించి ఇతడే మెస్సీయా అని తెలియజేసింది. దేవుణ్ణి కొనియాడింది. అటుపిమ్మట తల్లిదండ్రులు బాలుణ్ణి తీసికొని నజరేతుకి తిరిగివచ్చారు.

## 8. జ్ఞానులు శిశువుని సందర్శించడం -మత్త 2,1-12

హేరోదు రాజు పరిపాలనా కాలంలో జ్ఞానులు క్రొత్తచుక్కను ఆనవాలుగా పెట్టుకొని తూర్పుదేశం నుండి బయలుదేరి యెరూషలేముకు వచ్చారు. మేము యూదుల రాజుగా పుట్టిన శిశువుని ఆరాధించడానికి వచ్చాం. అతడు ఎక్కడ పుట్టాడో చెప్పమని హేరోదుని అడిగారు. ఆ రాజు జ్ఞానులను ప్రోగుజేయగా వాళ్లు క్రీస్తు బేత్లెహేములో పుడతాడని మీకా ప్రవక్త వ్రాశాడని తెలియజేశారు. హేరోదు జ్ఞానులతో మీరు వెళ్లి శిశువుని కనుగొని మళ్లా నాకు సమాచారం తెలియజేయండి. నేను గూడ వెళ్లి అతన్ని ఆరాధిస్తాను అని చెప్పాడు. నక్షత్రం మళ్లా వారిని నడిపించుకొని పోయి శిశువు వున్న స్థలం దగ్గర ఆగింది. వాళ్లు బాలుని దర్శించి ఆరాధించి కానుకలు సమర్పించారు. దేవుడు హేరోదు దగ్గరికి వెళ్లవద్దని హెచ్చరింపగా ఆ జ్ఞానులు వేరే త్రోవన తమ దేశానికి వెళ్లిపోయారు.

## 9. హేరోదు పసిబిడ్డలను చంపించడం - మత్త 2,13-18

జ్ఞానులు వెళ్లిపోయిన పిదప దేవదూత యోసేపుకి కలలో కన్పించి హేరోదు శిశువుని చంపగోరుతున్నాడు. నీవు అతన్ని తీసికొని ఈజిప్టుకి వెళ్లిపో అని చెప్పాడు. యోసేపు ఆ రాత్రే తల్లీ బిడ్డలతోపాటు ఈజిప్టుకి వలసపోయాడు.

ఇక్కడ హేరోదు జ్ఞానులు తన్ను మోసగించారని భావించి మండి పడ్డాడు. బేత్లెహేములోను దాని దరిదాపుల్లోను వున్న రెండేండ్ల లోపులోని బాలకులందరిని చంపివేయండని ఆజ్ఞాపించాడు. అతని బంటులు అలాగే చేశారు. ఆ బిడ్డలతోపాటు క్రీస్తు శిశువు కూడ మరణిస్తాడని రాజు

పన్నాగం. అటుపిమ్మట హేరోదు మరణించాడు. దేవదూత ఈజిప్టులోని యోసేఫుకి మరల కలలో కన్పించి శిశువుకి కీడు తలపెట్టినవాళ్లు గతించారు. ఇక నీవు సొంతదేశానికి వెళ్లిపోవచ్చు అని చెప్పాడు. యోసేఫు తల్లీ బిడ్డలతో పాటు యిస్రాయేలు దేశానికి తిరిగివచ్చి నజరేతు గ్రామంలో స్థిరపడ్డాడు.

## 10. దేవాలయంలో యేసు - లూకా 2,41-52

బాలయేసుకి పండ్రెండేండ్లు వచ్చినప్పుడు తల్లిదండ్రులు అతన్ని దేవాలయానికి తీసికొని పోయారు. తిరుగు ప్రయాణంలో యేసు దేవాలయంలోనే వుండిపోయాడు. తల్లిదండ్రులు ఆ సంగతి గ్రహించక తోడియాత్రికులతో ఒకరోజు ప్రయాణం చేశారు. ఆ పిమ్మట కుమారుని కొరకు వెతకగా అతడు కన్పించలేదు. విచారంతో మళ్లా యెరూషలేముకి తిరిగివచ్చి అక్కడ అతని కొరకు గాలించారు. మూడవరోజు అతడు దేవాలయంలో  వేదశాస్త్రుల మధ్య కూర్చుండి వారి బోధలు ఆలకిస్తూండగా చూచారు. తల్లి మరియ కుమారా! మీ నాయన నేను విచారంతో నీ కొరకు వెదుకుతున్నాం. నీవు మమ్ము విడిచిపెట్టి ఇక్కడ ఎందుకున్నావు అని అడిగింది. యేసు నేను నా తండ్రి పనిలో వుండాలి కదా! మీరు నా కోసం ఎందుకు వెదికారు అని బదులు పలికాడు. అతని పలుకులు వారికి అర్థం కాలేదు. ఆ పిమ్మట నజరేతుకు తిరిగివచ్చి తల్లిదండ్రులు చెప్పినట్లుగా నడుచుకొన్నాడు.

## 11. స్నాపక యోహాను బోధ - మత్త 8,1-8, యోహా 1,19-27

క్రీస్తు బహిరంగ జీవితం ప్రారంభించి బోధ చేయడానికి సిద్ధమౌతున్నాడు. అతనికి మార్గం తయారు చేయడానికి స్నాపక యోహాను ముందుకు వచ్చాడు. అతడు యోర్దాను నది సమీపంలో బోధ ప్రారంభించాడు. మీరు మీ పాపాలకు పశ్చాత్తాపపడి జ్ఞానస్నానం పొందండని హెచ్చరించాడు. అతడు ఏలీయా ప్రవక్తలాగ ఒంటె రోమాల కంబళిని

నడికట్టుగా ధరించాడు. ఎడారిలో వసిస్తూ మిడతలూ, పుట్టతేనే భుజించాడు. యోర్దాను నదిలో ప్రజలకు జ్ఞానస్నానం ఇచ్చాడు. మీరు మేము అబ్రాహాము సంతానానిమి, మాకు రక్షణం తప్పకుండా లభిస్తుంది అని ధీమాగా వుండి పోకండి. మంచిపండ్లను ఈయని ప్రతిచెట్టుని నరికి అగ్నిలో పడవేస్తారు. కనుక మీ పాపాలకు పశ్చాత్తాప పడండి అని ప్రజలను హెచ్చరించాడు.

ప్రజలు నీవు మెస్సియావా అని ప్రశ్నింపగా యోహాను నేను మెస్సియాను కాను, ఏలీయాను కాను, అంత్య దినాల్లో వచ్చే ప్రవక్తను కూడ కాను. ప్రభువుకి మార్గం సిద్ధం చేయండి అని యెడారిలో విన్పించే స్వరాన్ని మాత్రమే. మెస్సీయా రాకడకు జనాన్ని సిద్ధం చేయడం నా పని. నేను మీకు నీటితో జ్ఞానస్నానం ఇస్తున్నాను. నా తర్వాత వచ్చే మెస్సీయా మీకు పవిత్రాత్మతో జ్ఞానస్నానం ఇస్తాడు. నేను అతని పాదరక్షల వారు విప్పడానికి కూడ యోగ్యుణ్ణి కాను అని చెప్పాడు. ఈ విధంగా యోహాను ముందుగానే క్రీస్తుని ప్రజలకు పరిచయం జేశాడు.

## 12. క్రీస్తు జ్ఞానస్నానం, శోధనలు - మత్త 3,13-4,11

క్రీస్తు యోర్దాను నదికి వెళ్లి యోహాను నుండి జ్ఞానస్నానం పొందాడు. అప్పుడు పవిత్రాత్మ పావురంలాగ అతని మీదికి దిగివచ్చింది. తండ్రి ఇతడు నాకు ప్రీతి కలిగించే కుమారుడు. నేను ఇతన్ని తలంచుకొని ఆనంది స్తున్నాను అని సాక్ష్యం పలికాడు.

అటుతర్వాత ఆత్మ అతన్ని యెడారికి కొనిపోయింది. అక్కడ నలభైరోజులు ఉపవాసం చేశాక పిశాచం అతన్ని శోధించింది. అది నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లను రొట్టెలుగా మార్చి భుజించు అంది. నరుడు రొట్టెతోనే గాక దేవుని వాక్కు వలన గూడ జీవిస్తాడు అని యేసు సమాధానం చెప్పాడు. ఇది మొదటి శోధనం.

మళ్లా పిశాచం అతన్ని దేవాలయం శిఖరం మీద కూర్చోబెట్టి నీవు దేవుని కుమారుడవైతే ఇక్కడి నుండి క్రిందికి దూకు. దేవదూతలు

దిగివచ్చి నిన్ను కాపాడతారులే అంది. క్రీస్తు నీవు దేవుణ్ణి శోధించకూడదు అని జవాబు చెప్పాడు. ఇది రెండవ శోధనం.

మూడవసారి పిశాచం క్రీస్తుకి భూలోక రాజ్యాలన్నీ చూపించింది. నీవు నన్ను ఆరాధించావంటే నేను ఈ రాజ్యాలన్నీ నీకు ఇచ్చి వేస్తాను అని చెప్పింది. క్రీస్తు దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలి అని చెప్పాడు. పిశాచం ఓడిపోయి వెళ్లిపోగా దేవదూతలు వచ్చి క్రీస్తుకి సేవలు చేశారు.

## 13. మొదటి ఐదుగురు శిష్యులు -యోహా 1,35-51

స్నాపక యోహాను తన శిష్యులైన అంద్రెయ యోహానులకు క్రీస్తుని చూపించి ఇదిగో! దేవుని గొర్రెపిల్ల అని చెప్పాడు. వాళ్లు యోహానుని విడిచిపెట్టి క్రీస్తుకి శిష్యులయ్యారు. ఆంద్రెయ తన అన్న పేతురుని క్రీస్తు దగ్గరికి తీసికొని వచ్చాడు. క్రీస్తు అతన్ని చూచి ఇక మీదట నిన్ను కేఫా లేక రాయి అని పిలుస్తారు అని చెప్పాడు. కనుక అతని పేరు పేతురు లేక రాయప్ప ఐంది.

ఫిలిప్పు కూడ పేతురులాగే బెత్సయిదా నగర వాసి. క్రీస్తు పిలువగా అతడు కూడా ప్రభువుకి శిష్యుడయ్యాడు. ఈ ఫిలిప్పు నతనియేలుని క్రీస్తు దగ్గరికి తీసికొని వచ్చాడు. క్రీస్తు నేను నిన్ను పూర్వమే అంజూరపు చెట్టు క్రింద చూచాను అన్నాడు. అతడు కూడ ప్రభువుకి శిష్యుడు అయ్యాడు. ఈ రీతిగా తొలి ఐదుగురు శిష్యులు ప్రోగయ్యారు.

## 14. పర్వత ప్రసంగం - మత్త 5-7

ప్రభువు పర్వతమెక్కి శిష్యులకు ప్రజలకూ బోధ చేశాడు. ఈ ప్రసంగం శతాబ్దాల పొడుగున చాలమందికి ప్రేరణం పుట్టించింది. క్రీస్తు బోధల సారాంశమంతా దీనిలో యిమిడి వుంది.

పసిబిడ్డడు పెద్దవారిమీద లాగే నరుడు దేవునిమీద ఆధారపడి జీవించాలి. అతడు వినయంగాను, దయామయుడుగాను వుండాలి. హృదయం నిర్మలంగా వుండాలి.

శిష్యులు భోజనంలో వుప్పులా వుండాలి. చీకటిలో దీపంలా వుండాలి. వారి పనులు యోగ్యంగా వుండాలి.

క్రీస్తు ధర్మశాస్త్రాన్ని రద్దు చేయడానికి గాక పరిపూర్ణం చేయడానికి వచ్చాడు. క్రీస్తు శిష్యులు యూదులకంటె అధికంగా పవిత్ర జీవితం గడపాలి.

తోడివారితో ఒద్దికగా జీవించాలి. దేవుణ్ణి పూజిస్తేనే చాలదు. ఇరుగు పొరుగు వారితో ప్రేమగా మెలగాలి. శత్రువులను ప్రేమించాలి. పగ తీర్చుకో గూడదు. మంచివారినీ చెడ్డవారినీ కూడ అంగీకరించాలి. దేవుడు సజ్జనులకూ, దుర్జనులకూ గూడ సమానంగా వాన కురిపిస్తాడు. అందరికీ సూర్యుని వెలుగునీ, వేడిమినీ ప్రసాదిస్తాడు. మిత్రులను మాత్రమే ఆదరిస్తే మన గొప్ప యేమిటి?

మన దానధర్మాలను పదిమందికి ప్రకటించనక్కరలేదు. కుడిచేయి చేసే దానాన్ని ఎడమచేతికి తెలియకుండేలా చేయాలి. దేవుడు మన సత్కార్యాలను చూచి మెచ్చుకోవాలి గాని నరులు మెచ్చుకుంటే యేమి ప్రయోజనం? మన ప్రార్థన ఉపవాసాలు మొదలైన పుణ్యక్రియలు కూడ నరులు చూచి మెచ్చుకొనేలా వుండకూడదు. దేవుడు వాటిని గుర్తిస్తే చాలు.

ఈ లోకంలో సంపదలు కూడబెట్టుకొంటే చాలదు. అవి కొద్దికాలం లోనే నాశమైపోతాయి. మన సంపదలు పరలోకంలో దేవుని సన్నిధిలో వుండాలి. నరులు దేవుణ్ణీ ధనాన్నీ ఒకేసారి సేవించలేరు.

ప్రజలు దేవుణ్ణి నమ్మి అతనిమీద ఆధారపడి జీవించాలి. కూడు గుడ్డా కొరకు వెంపర్లాడ కూడదు. పరలోకంలోని తండ్రి ఆకాశ పక్షులకు తిండి పెడతాడు. గడ్డిమొక్కలను పూల బట్టలతో అలంకరిస్తాడు. తన బిడ్డలమైన మనకు అవసరమైనవి తప్పకుండా దయచేస్తాడు. కనుక రేపటిని గూర్చి చింతలు వంతలు అవసరం లేదు.

పరులకు తీర్పు తీర్చకూడదు. ఇతరులను సులువుగా విమర్శించ

కూడదు. మన కంటిలో దూలం వుండగా ప్రక్కవాడి కంటిలోని నలుసుని చూడకూడదు.

దేవుణ్ణి నమ్మకంతో అడుగుకోవాలి. బిడ్డడు ఆకలిగొని అన్నం పెట్టమంటే తల్లిదండ్రులు పెట్టరా?

పండునుబట్టి చెట్టు ఏలాంటిదో తెలుస్తుంది. నరుని క్రియలను బట్టి అతడెలాంటివాడో తెలిసి పోతుంది. మంచివాళ్లుగా నటిస్తేనే చాలదు.

ఇతరులు మనకు ఏమి చేయాలని కోరుకొంటామో అదే మనం ఇతరులకు చేయాలి.

పర్వత ప్రసంగాన్ని ఆనాటి ప్రజలు మెచ్చుకొన్నారు. అది యిప్పుడు మనకు కూడ ప్రేరణం పుట్టిస్తుంది.

## 15. నీటిని ద్రాక్షరసంగా మార్చడం -యోహా 2,1-11

యేసు, శిష్యులు, తల్లి మరియ కానావూరి వివాహానికి వెళ్లారు. ఆ పెండ్లిలో ద్రాక్షరసం కొరతపడింది. తల్లి మరియ వారికి రసం ఐపోయింది అని కుమారునితో చెప్పింది. క్రీస్తు నేను అద్భుతాలు చేసే సమయం ఇంకా రాలేదు గదా అన్నాడు. మరియ సేవకులతో మీరు ఆయన చెప్పినట్లు చేయండి అని నుడివింది. జనం కడుగుకొని శుద్ధి చేసికోవడానికి అక్కడ ఆరు రాతి బానలు ఉన్నాయి. యేసు ఆజ్ఞపై వాటిని నీటితో నింపగా అతడు ఆ నీటిని రసంగా మార్చాడు. విందు నడిపే పెద్ద ఆ రసాన్ని రుచి చూచి ఆశ్చర్యపోయాడు. పెండ్లి కుమారునితో విందుల్లో మామూలుగా మొదట మంచి రసాన్ని పోస్తారు. కడన నాసిరకం రసాన్ని పోస్తారు. కాని నీవు మెరుగైన రసాన్ని కడపటిదాక అట్టిపెట్టావు అన్నాడు. ఇది యేసు చేసిన మొదటి అద్భుతం. శిష్యులు అతని శక్తిని గుర్తించారు.

## 16. దేవాలయాన్ని శుద్ధిచేయడం - యోహా 2,13-22

యేసు పాస్కపండుగకు యెరూషలేము వెళ్లాడు. అక్కడ దేవాలయం బేరగాళ్లతో నిండిపోయింది. ఎడ్లను, గొర్రెలను, పావురాళ్లను అమ్మె

తున్నారు. డబ్బులు మారుస్తున్నారు. క్రీస్తు కోపంతో కొరడా పేని వారి పశువులను బయటికి తోలాడు. డబ్బులు మార్చేవారి బల్లులు కూలద్రోశాడు. వీటినన్నిటినీ ఇక్కడి నుండి తీసికొని పోండి. నా తండ్రి ఆలయం సంతపట్టుకాదు అని అరచాడు. యూదనాయకులు నీవు ఏ యధికారంతో వీళ్లను వెళ్లగొడుతున్నావు? మాకు ఏమి గురుతు చూపిస్తావు అని అడిగారు. అతడు మీరు ఈ దేవళాన్ని పడగొట్టండి. నేను మళ్లా మూడురోజుల్లో దీన్ని నిర్మిస్తాను అని జవాబు చెప్పాడు. నాయకులు దీన్ని కట్టడానికి 46 ఏండ్లు పట్టింది. నీవు మూడు నాళ్లలోనే దీన్ని మళ్లా కడతావా అని అడిగారు. ఐతే క్రీస్తు కడతానని చెప్పింది రాతిగుడికాదు. సొంత శరీరమనే ఆలయాన్నే. అతని పునరుత్థానం తర్వాత శిష్యులు ఈ మాటల భావాన్ని గ్రహించారు. ఇక్కడ దేవాలయం క్రీస్తు పునరుత్థాన శరీరమే.

## 17. నికొదేము - యోహా 3,1-17

నికొదేము యూదుల మహాసభ సభ్యుడు. ధర్మశాస్త్ర బోధకుడు. అతడు యూదులకు భయపడి రాత్రివేళ యేసుదగ్గరికి వచ్చాడు. నీవు దేవుని నుండి వచ్చావు. దేవుని సహాయం లేందే నీవు ఈ యద్భుతాలు చేసి వుండేవి కాదు అన్నాడు. యేసు నరుడు మరల జన్మిస్తేనే గాని దైవ రాజ్యంలో ప్రవేశించలేడు అని చెప్పాడు. ఆ మాటలు నికొదేముకి అర్థం కాలేదు. అతడు జనుడు తల్లి గర్భంలోకి ప్రవేశించి మరల పుడతాడా అని అడిగాడు. యేసు జ్ఞానస్నానం వలన నరునికి నూత్నజన్మ సిద్ధిస్తుంది. మనుష్య కుమారుడు సిలువమీద చనిపోయి నరులకు రక్షణాన్ని ప్రసాదిస్తాడు. తండ్రి లోకంలోని నరులను ప్రేమించి తన ఏకైక కుమారుని పంపాడు. ఆ కుమారుని విశ్వసించే ప్రతివాడు రక్షణం పొందుతాడు అని చెప్పాడు. నికొదేముకి క్రీస్తు పట్ల విశ్వాసం పుట్టింది. తర్వాత అతడు క్రీస్తు శరీరాన్ని భూస్థాపనం చేయడంలో సాయపడ్డాడు. ఈ భక్తునిలాగే మనం కూడ ప్రభువుని నమ్మాలి.

# 18. సమరయ స్త్రీ - యోహా 4

యేసు సమరయ రాష్ట్రం గుండ ప్రయాణం చేస్తూ సుఖారు నగరంలోని యాకోబు బావి దగ్గర ఆగాడు. శిష్యులు ఆహార పదార్థాలు కొనడానికి నగరంలోకి వెళ్లారు. ఒక సమరయ స్త్రీ నీటిని తోడుకొని పోవడానికి అక్కడికి వచ్చింది. యేసు అమ్మా! త్రాగడానికి కొంచెం నీళ్లు ఇవ్వమని అడిగాడు. ఆమె యూదుడవైన నీవు మా నీళ్లు ఎలా త్రాగుతావు అంది. అతడు అమ్మా నేనెవరినో నీవు గుర్తించినట్లయితే నీవే నన్ను నీళ్లీయమని అడిగేదానివి. నేను నీకు జీవజలం ఇచ్చివుండేవాడిని అని చెప్పాడు. ఆమె అయ్యా! నీ దగ్గర బొక్కెనలేదు. నాకు జీవజల మెలాగిస్తావు? నీవు ఈ బావి త్రవ్వించిన యాకోబుకంటె గొప్పవాడివా యేమి అని అడిగింది. యేసు ఈ నీళ్లు త్రాగితే మళ్లా దప్పిక వేస్తుంది. కాని నేనిచ్చే నీళ్లు త్రాగితే ఇక దప్పిక వేయదు అన్నాడు. ఆమె, ఐతే నాకు ఆ నీళ్లు ఇవ్వు అని అడిగింది.

యేసు నీవు వెళ్లి నీ భర్తను తీసుకొనిరా అని చెప్పాడు. ఆమె నాకు పెనిమిటి లేదు అని జవాబు చెప్పింది. యేసు అమ్మా! నీవు ఐదుగురితో కాపురం చేశావు. ఇప్పుడున్నవాడు కూడ నీ పెనిమిటి కాడు అని చెప్పాడు. ఆలా అతడు తన సొంత విషయాలు చెప్పడం చూచి ఆమె విస్తుపోయి అయ్యా! నీవు ప్రవక్తలా గున్నావు. మా ప్రజలు గెరిజం కొండమీద దేవుణ్ణి ఆరాధిస్తున్నారు. మీవాళ్లు యెరూషలేములో దేవుణ్ణి పూజిస్తున్నారు అని పల్కింది. యేసు ఇకమీదట అందరూ ఆత్మద్వారా తండ్రిని ఆరాధిస్తారు అని చెప్పాడు. ఆమె, మెస్సీయా వచ్చినప్పుడు మాకు అన్ని విషయాలు తెలియజేస్తాడు అని చెప్పింది. యేసు నేనే ఆ మెస్సీయాను సుమా అని పల్కాడు.

ఆమె త్వరగా నగరంలోనికి వెళ్లి జనంతో ఒక మనిషి నేను చేసిన పనులన్నీ తెలియజెప్పాడు. ఒకవేళ అతడే మెస్సియా యేమో అని చెప్పింది. ఆ నగర వాసులు యేసుని చూడ్డానికి వచ్చి అతని బోధలు

విన్నారు. వారి కోరికపై అతడు ఆ వూరిలో రెండు రోజులు మాకాము చేశాడు. ఆ జనం మేము స్వయంగా ఇతని బోధలు విన్నాం. ఇతడు నిజంగానే లోకరక్షకుడు అని పల్కారు.

## 19. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీ - యోహా 8,1-11

ఒకసారి ప్రభువు దేవళంలో బోధిస్తుండగా ధర్మశాస్త్ర బోధకులు వ్యభిచారంలో చిక్కిన స్త్రీని అతని దగ్గరికి కొనివచ్చి ధర్మశాస్త్రం ఆదేశించి నట్లుగా ఈమెను రాళ్లతో కొట్టమంటావా వద్దా అని అడిగారు. క్రీస్తు ఏ విధంగా జవాబు చెప్పినా చిక్కుల్లో పడతాడని వారి ఉద్దేశం. ప్రభువు వారితో మీలో పాపం చేయనివాడు మొదట ఆమె మీద రాయి విసరవచ్చు అన్నాడు. ఆ జవాబు విని ప్రజలు సిగ్గుపడి ఒకరివెంట వొకరు జారుకొన్నారు. ప్రభువు ఆ స్త్రీని చూచి వీళ్లు నిన్ను శిక్షించలేదు. నేను కూడ నిన్ను శిక్షించను. ఇక వెళ్లు. మళ్లా తప్పు చేయకు అని హెచ్చరించాడు.

## 20. నజరేతులో క్రీస్తు బోధ - లూకా 4,16-30

సుఖారు నుండి క్రీస్తు సొంత నగరమైన నజరేతుకి వచ్చాడు. శనివారం ప్రార్థనా మందిరానికి వెళ్లి ప్రజలకు యెషయా ప్రవచనం చదివి విన్పించాడు. ఆ ప్రవక్త మెస్సీయా వచ్చినపుడు పేదలను ఆదుకొంటాడు అని వ్రాశాడు. క్రీస్తు ఆ యెషయా ప్రవచనం తనకే వర్తిస్తుందనీ తాను పేదలకోపు తీసికొనేవాణ్ణనీ నుడివాడు. ప్రజలు అతని బోధ విని యోసేపు కుమారునికి ఇంత జ్ఞానం ఏలా అలవడిందా అని విస్తుపోయారు.

అటుపిమ్మట యేసు పూర్వం యేలీయా ప్రవక్త సారెఫతు గ్రామానికి చెందిన అన్యజాతి విధవకూ, యెలీషా ప్రవక్త అన్యజాతి వాడైన నామానుకూ సహాయం చేశారని నుడివాడు. యూదులకు అన్యజాతి వాళ్లు గిట్టరు. కనుక వారి ప్రస్తావనం తెచ్చిన క్రీస్తుమీద మండిపడ్డారు. వారి నగరం కొండమీద వుంది. అతన్ని ఆ కొండమీదికి తీసికొనిపోయి

అక్కడి నుండి క్రిందికి త్రోయబోయారు. కాని యేసు వారి మధ్యనుండి తప్పించుకొని వెళ్లిపోయాడు.

## 21. రోగులకు స్వస్థత -లూకా 4,31-42

యేసు నజరేతునుండి కఫర్నాముకి వచ్చాడు. అచట ప్రార్థనా మందిరంలో దయ్యం పట్టినవాడు కన్పించాడు. ఆ దయ్యం నీవు దేవుని పవిత్ర మూర్తివి. నీవు మమ్ము నాశం చేయడానికి వచ్చావు అని అరచింది. ప్రభువు నీవు ఇతన్ని విడచి వెళ్లిపో అని ఆజ్ఞాపించగానే అది వెళ్లిపోయింది. దయ్యాలు కూడ ఇతనికి లొంగుతున్నాయి కదా అని ప్రజలు ఆశ్చర్య పోయారు.

పిమ్మట ప్రభువు సీమోను ఇంటికి పోయాడు. అక్కడ సీమోను అత్త జ్వరంతో మంచంపట్టివుంది. జనం ఆమె సంగతి క్రీస్తుకి తెలియజేశారు. అతడు ఆమె దగ్గరికి పోయి జ్వరాన్ని విడచిపొమ్మని ఆజ్ఞాపింపగా అది వదలిపోయింది. ఆమె లేచి క్రీస్తుకి భోజనం సిద్ధం చేసింది. ఆ సాయంకాలం చాలమంది రోగులు రాగా యేసు వారి వ్యాధులు నయం చేశాడు. నీవు దేవుని కుమారుడివి అని అరుస్తూ అనేకుల నుండి దయ్యాలు వెళ్లిపోయాయి.

## 22. శిష్యులకు పిలుపు - లూకా 5,1-11

యేసు గెన్నెసరీతు సరస్సు తీరాన వున్నాడు. జనం అతని బోధ వినడానికి వచ్చారు. ప్రభువు పేతురుచే పడవను నీటిలోనికి త్రోయించి దానిలో కూర్చుండి బోధ చేయగా ప్రజలు విన్నారు. అటుపిమ్మట యేసు పడవను సరస్సులోనికి కొనిపోయి చేపలను పట్టండని చెప్పాడు. పేతురు, మేము రాత్రంతా తిప్పలు పడ్డాం. చేపలు ఏ మాత్రం దొరకలేదు. ఐనా నీ మాట ప్రకారం ఇప్పుడు మళ్లా ప్రయత్నం చేస్తాం అన్నాడు. బెస్తలు వలవేయగానే అది పిగిలి పోయేలా చేపలుపడ్డాయి. పేతురు ఇంకో పడవ వారిని గూడ వచ్చి సహాయం చేయమని పిల్చాడు. రెండు పడవలు

నిండేటంతగా చేపలు దొరికాయి. పగలు అన్ని చేపలు చిక్కడం చూచి పేతురు ఆశ్చర్యపోయి ప్రభూ! నేను పాపాత్ముణ్ణి. నీవు నన్ను విడచి వెళ్లిపో అని అరచాడు. యేసు అతనితో ఇకమీదట నీవు చేపలను గాక మనుష్యులను పడతావు అని చెప్పాడు. ఆ పిమ్మట ఆ బెస్తలు అన్నీ వదిలివేసి క్రీస్తుకి శిష్యులయ్యారు.

## 23. పక్షవాతరోగికి ఆరోగ్యం -లూకా 5,17-26

యేసు ఒక యింటిలో బోధ చేస్తుండగా జనం క్రిక్కిరిసివున్నారు. కొందరు ఓ పక్షవాత రోగిని అతని చెంతకు మోసికొని వచ్చారు. కాని జనం ఇంటినిండ క్రిక్కిరిసి వున్నందున అతని చెంతకు వెళ్లలేక పోయారు. కనుక ఇంటిమీది కప్పు ఊడదీసి మంచంతో పాటు రోగిని క్రీస్తు ముందటికి జారవిడిచారు. యేసు వారి విశ్వాసాన్ని మెచ్చుకొని రోగితో బాబూ! నీ పాపాలు క్షమింపబడ్డాయి అని చెప్పాడు. అక్కడ ప్రోగైవున్న ధర్మశాస్త్ర బోధకులు పాపాలు క్షమించడానికి ఇతడెవరు? ఆ పని చేసేది దేవుడొక్కడే కదా అని తమలో తాము తర్కించుకొన్నారు. క్రీస్తు వారితో ఏది సులభం? పాపాలు క్షమించడమా లేక రోగిని నడిపించడమా? నాకు పాపాలు క్షమించే అధికారం గూడ వుందని నిరూపిస్తాను అని చెప్పి రోగిని నీవు లేచి యింటికి వెళ్లిపో అని ఆదేశించాడు. రోగి వెంటనే లేచి యింటికి వెళ్లిపోయాడు. యూదుల భావాల ప్రకారం పాపాలు వ్యాధిని తెచ్చిపెడతాయి. ఇక్కడ రోగి లేచినడచాడు అనగా అతని పాపాలు తొలగిపోయినట్లే కదా! ఈలా క్రీస్తుకి పాపాలు పరిహరించే శక్తి కూడ వుందని రుజువైంది.

## 24. శతాధిపతి సేవకునికి ఆరోగ్యం - లూకా 7,1-10

కఫర్నాములో ఓ రోమను శతాధిపతి వున్నాడు. అతని సేవకుడు జబ్బు పడ్డాడు. ఆ వుద్యోగి యూదులను అభిమానంతో చూచి వారికి ప్రార్థనా మందిరాన్ని కట్టిపెట్టాడు. కనుక పెద్దలు ఆ సేవకుని వ్యాధి నయంజేయమని యేసుకి సిఫార్సు చేశారు. అతడు శతాధిపతి యింటికి

పోతూండగా ఆ వుద్యోగి మిత్రులను పంపి అయ్యా! నీవు మా యింటికి రావడానికి నేను యోగ్యుణ్ణి కాను. నీవు వున్న చోటనే వుండి ఒక్కమాట పలికితే చాలు, నా దాసుడు బాగుపడతాడు అని చెప్పించాడు. క్రీస్తు అతని విశ్వాసాన్ని మెచ్చుకొని అక్కడినుండే ఆ సేవకుని వ్యాధిని కుదిర్చాడు.

## 25. నాయీను వితంతువు కుమారుడు -లూకా 7,11-17

యేసు నాయీను గ్రామాన్ని సమీపిస్తూండగా ఓ యువకుని శవాన్ని మోసుకొని పోతున్నారు. అతడు ఓ విధవకు ఏకైక కుమారుడు. యేసు ఆ తల్లి పై జాలిగొని పాడెను చేతితోతాకి యువకుడా! నీవు జీవంతో లే అని చెప్పాడు. వెంటనే అతడు లేచి కూర్చున్నాడు. ప్రజలు ఆశ్చర్యపోయి ఓ గొప్ప ప్రవక్త మనమధ్యకు వచ్చాడు అని పలికి దేవుణ్ణి స్తుతించారు.

## 26. యోహాను దూతలు -మత్త 11,2-6

హేరోదు ఆంటిప గలిలయకు పాలకుడయ్యాడు. అతడుతన తమ్ముడు ఫిలిప్పు బార్యను ఉంచుకొన్నాడు. యోహాను ఇది ధర్మం కాదని హేరోదుని మందలించాడు. ఆ రాజు కోపించి యోహానుని చెరలో త్రోయించాడు. అతనికి క్రీస్తుపట్ల సందేహం కలిగి ఇద్దరు శిష్యులను పంపించాడు. వాళ్లు రాబోయే మెస్సీయావు నీవా లేక మేము మరొకరికొరకు ఎదురు చూడాలా అని మా గురువు అడుగుతున్నాడు అని చెప్పారు. క్రీస్తువారితో మీరు నా అద్భుతాలను యోహానుకి తెలియజేయండి. మృతులు జీవంతో లేస్తున్నారు. నేను పేదలకు సువార్త బోధిస్తున్నాను. నన్ను గూర్చి సందేహించవద్దని మీ గురువుకి తెలియజేయండి అని చెప్పాడు.

## 27. సీమోను ఇంటిలో పాపాత్మురాలు -లూకా 7,36-49

యేసు సీమోను అనే పరిసయుని ఇంటికి భోజనానికి వెళ్లాడు. ప్రభువు బోధల వలన అదివరకే పరివర్తనం చెందిన ఓ పాపాత్మురాలు అచ్చటికి వచ్చింది. అతని పాదాలను కన్నీటితో తడిపి తలవెంట్రుకలతో తుడిచి పరిమళద్రవ్యంతో అభిషేకం చేసింది. సీమోను తన్ను తాకుతూ

వున్న ఈ స్త్రీ ఎలాంటిదో తెలిసికోలేని ఈ యేసు ఏ పాటి ప్రవక్త అని తనలో తాను అనుకొంటున్నాడు. ప్రభువు సీమోనూ! ఓ ధనవంతునికి ఒకడు పెద్ద మొత్తమూ, ఇంకొకడు చిన్న మొత్తమూ బాకీ పడ్డారు. వాళ్ల బాకీ తీర్చలేనందున అతడు ఇద్దరినీ క్షమించాడు. వారిలో ఎవడు ధనవంతుని ఎక్కువగా ప్రేమిస్తాడో చెప్పు అని అడిగాడు. సీమోను ఎక్కువ మొత్తం క్షమింపబడినవాడే కదా అన్నాడు. ప్రభువు నీవు చెప్పింది నిజమే. దేవుడు ఈ భక్తురాలి పాపాలను అధికంగా క్షమించాడు. కనుక ఈమె అతన్ని అధికంగానే ప్రేమించింది సుమా అని చెప్పాడు. పిమ్మట ఆ స్త్రీని చూచి అమ్మా! నీ పాపాలకు క్షమాపణం లభించింది. ఇక సంతోషంగా వుండు అని పల్కాడు.

## 28. దీర్ఘకాల రోగికి ఆరోగ్యం - యోహా 5,1-18

యేసు పాస్క పండుగకు యెరూషలేము వెళ్లాడు. అక్కడ బెత్సతా అనే కొనేరు వుంది. దానిలో అప్పుడప్పుడు నీళ్లు కదిలేవి. ఆలా కదిలినప్పుడు మొదట నీటిలో దిగిన రోగికి ఆరోగ్యం చేకూరేది. కనుక చాలమంది రోగులు అక్కడ కనిపెట్టుకొని వుండే వాళ్లు. అక్కడ 38ఏండ్లనుండి వ్యాధితో బాధపడుతున్న రోగి వొకడున్నాడు. చాలకాలం అక్కడ వేచివున్నా అతనికి మడుగులో దిగే అవకాశం లబించలేదు. ప్రభువు అతన్ని నీకు ఆరోగ్యం కావాలా అని అడిగాడు. అతడు అయ్యా! నీరు కదిలినప్పుడు నన్ను నీటిలో దించేవాళ్లు ఎవరూ లేరు. ఇతరులు నా కంటె ముందుగా పోయి కోనేటిలో దిగుతున్నారు అని చెప్పాడు. ప్రభువు నీ పడకనెత్తుకొని ఇక్కడినుండి వెళ్లిపో అని చెప్పాడు. అతడు వెంటనే ఆరోగ్యాన్ని పొంది పడవనెత్తుకొని నడచాడు.

అది విశ్రాంతి దినం కావడంచే చిన్నపని కూడ చేయకూడదు. కనుక యూద నాయకులు అతన్ని తప్పుపట్టారు. నిన్ను పడక మోయమన్నది ఎవరని దబాయించారు. అతనికి యేసుని గూర్చి తెలియదు కనుక వారికి జవాబు చెప్పలేకపోయాడు.

తర్వాత ప్రభువు దేవాలయంలో అతన్ని చూచి నీకు ఆరోగ్యం కలిగింది కదా! ఇక పాపం చేయకు. చేశావో మరింత కీడు చుట్టు కొంటుంది సుమా అని చెప్పాడు. అతడు వెళ్లి తనకు వ్యాధి నయం జేసినవాడు యేసని నాయకులకు తెలియజేశాడు. విశ్రాంతి దినాన ఆరోగ్యాన్ని చేకూర్చి పడక మోయడమనే పని చేయించినందుకు యూదులు క్రీస్తుపై ఆగ్రహం చెంది అతన్ని బాధించడం మొదలు పెట్టారు. వాళ్లు రోగి ఆరోగ్యాన్ని పొందినందుకు సంతోషించలేదు. అతడు విశ్రాంతి దినాన పడక మోసి నందుకు కోపించారు.

## 29. మత్తయికి పిలుపు - మత్త 9,9-13

యేసు గలిలయ సరస్సు ప్రక్కన నడుస్తూ సుంకాల శాలలో సుంకాలు వసూలు చేసే మత్తయిని చూచి నీవు నన్ను అనుసరించు అని చెప్పాడు. మత్తయి తన ఉద్యోగాన్నీ డబ్బునీ వదలిపెట్టి క్రీస్తు వెంట పోయాడు. తర్వాత అతడు ప్రభువుకి పెద్ద విందు చేశాడు. ఆ విందుకి చాలమంది సుంకరులు వచ్చారు. పరిసయులు సుంకరులను అసహ్యించుకొనే వాళ్లు. క్రీస్తు వారితో కలసి భోజనం చేయడం నచ్చనందున వాళ్లు అతనిపై గొణిగారు. ప్రభువు నేను వ్యాధిగ్రస్తుల కొరకు వచ్చిన వైద్యుణ్ణి. నేను పాపుల కొరకు వచ్చాను గాని పుణ్యాత్ముల కొరకు కాదు అని జవాబు చెప్పాడు. అతనికి పాపులమీద కరుణ మిక్కుటంగా వుండేది.

## 30. విత్తేవాని ఉపమానం - మత్త 13,4-22

ఓ రైతు పొలంలో విత్తనాలు వెదజల్లుతూండగా కొన్ని విత్తనాలు త్రోవ నేలలో పడ్డాయి. పక్షులు వచ్చి వాటిని తినివేశాయి. కొందరు అసలు వాక్యం భావాన్ని అర్థం చేసికొనే ప్రయత్నమే చేయరు. పిశాచం వచ్చి వారి హృదయంలో పడిన వాక్యాన్ని ఎత్తుకొని పోతుంది.

ఇంకా కొన్ని విత్తనాలు రాతినేలపై బడ్డాయి. అవి వేరు

పాతుకోలేదు. సూర్యుని వేడిమికి ఎండిపోయాయి. జీవితంలో ఇబ్బందులు హింసలు ఎదురైనపుడు కొందరిలో వాక్యం అనే మొలకలు ఎండిపోతాయి.

మరికొన్ని విత్తనాలు ముండ్లనేలలో పడ్డాయి. ముండ్లపొదలు ఆ మొలకలను అణిచి వేశాయి. లోకవ్యామోహాల్లో చిక్కుకొన్నవారిలో వాక్యం ఫలించదు.

వేరు కొన్ని సారవంతమైన నేలపై బడి నూరంతలు, అరువదంతలు ముప్పదంతలు పంటనిచ్చాయి. కొందరిలో దేవుని వాక్కు మంచి ఫలితాన్ని ఇస్తుంది.

విత్తనం ప్రభువు వాక్కే. నాల్గు రకాల నేలలు మన హృదయాలే. హృదయం భక్తివిశ్వాసాలు కలదై సారవంతమైన నేలలా వుంటే దానిలో పడిన దైవవాక్కు మంచి ఫలితాన్ని ఇస్తుంది.

## 31. గోదుమపైరు, కలుపు మొక్కలు - మత్త 13

ఓ రైతు పొలంలో గోదుమగింజలు చల్లాడు. కాని అతని శత్రువు వచ్చి ఆ పొలంలో కలుపు గింజలు చల్లిపోయాడు. గోదుమపైరుతో పాటు కలుపుమొక్కలు కూడ పెరిగాయి. జీతగాళ్లు రైతుని కలుపుమొక్కలు పెరికి వేయమంటావా అని అడిగారు. రైతు వద్దు. వాటిని లాగినప్పుడు గోదుమ మొక్కలు కూడ వూడి వస్తాయి. కోతకాలంలో ముందుగా కలుపుని పెరికివేసి అగ్నిలో కాల్చి వేయవచ్చు. గోదుమలను ఇంటికి తెచ్చుకోవచ్చు అని చెప్పాడు.

ఇక్కడ పొలంలో గోదుమలు చల్లినవాడు క్రీస్తే. గోదుమపైరు భక్తిగల నరులను సూచిస్తుంది. కలుపు గింజలు చల్లినవాడు పిశాచం. ఈ కలుపు భక్తి విశ్వాసాలు లేని దుష్టులను సూచిస్తుంది. న్యాయ నిర్ణయ దినాన వీరికి శిక్ష పడుతుంది.

## 32. తుఫానుని ఆపడం -మత్త 8,23-27

ఒకసారి యేసూ శిష్యులూ పడవలో ప్రయాణం చేస్తూండగా పెద్ద

గాలివాన పట్టుకొంది. క్రీస్తు అలసిపోయి పడవలో ఓ మూలన పండుకొని నిద్రపోతున్నాడు. శిష్యులు ప్రభూ! మేము ఆపదలో వున్నాం, మమ్ము కాపాడవా అంటూ ప్రభువుని నిద్ర లేపారు. అతడు గాలిని సముద్రాన్ని ఆజ్ఞాపించగా వెంటనే వాతావరణం నిమ్మళమైంది. ఆ పడవలో వున్న వాళ్లు ప్రకృతి శక్తులు కూడ ఇతనికి లొంగుతున్నాయి కదా అని ఆశ్చర్యపోయారు. మన జీవితంలో ఎదురయ్యే ఆపదల్లో ప్రభువుని శరణు వేడితే అతడు వాటినుండి మనలను కాపాడతాడు.

## 33. రక్తస్రావరోగి, చనిపోయిన బాలిక -మత్త 9,18-26

యాయీరు అనే అధికారి కూతురు జబ్బుపడి మరణావస్థలో వుంది. అతడు నీవు వచ్చి నా బిడ్డకు ఆరోగ్యం చేకూర్చుమని క్రీస్తుని వేడుకొన్నాడు. ప్రభువు అతని యింటికి వెళ్తూండగా జనం ప్రభువు చుట్టూ ప్రోగయ్యారు. పంద్రెండు సంవత్సరాలనుండి రక్తస్రావంతో బాధపడుతూన్న ఓ స్త్రీ వచ్చి ఆయన వస్త్రాన్ని తాకింది. అతని బట్టలను ముట్టుకొంటే చాలు తనకు ఆరోగ్యం చేకూరుతుందని ఆమె నమ్మకం. వెంటనే ఆమెకు ఆరోగ్యం కలిగింది. ప్రభువు తననుండి శక్తి వెలుపలికి వెళ్లిందని గ్రహించి నా దుస్తులను తాకింది ఎవరని అడిగాడు. రోగి భయపడుతూ ముందుకు వచ్చి అయ్యా తాకింది నేనేనని చెప్పింది. ప్రభువు కుమారీ! నీ విశ్వాసమే నీకు ఆరోగ్యాన్ని చేకూర్చింది అని చెప్పాడు.

అంతలో యాయీరు స్నేహితులు ఎదురు వచ్చి బాలిక చని పోయిందని చెప్పారు. ప్రభువు యాయీరుతో నీవు భయపడకు. నమ్మకంతో వుండు అని చెప్పాడు. అందరూ బాలిక వున్న గది ప్రవేశించారు. క్రీస్తు అమ్మాయి చేయి పట్టుకొని బిడ్డా! లెమ్మని చెప్పాడు. వెంటనే ఆ యమ్మాయి లేచి అటూయిటూ నడచింది. ప్రభువు ఆమెకు తినడానికి ఏమైనా పెట్టండని చెప్పాడు. ఈ యద్భుత కార్యాన్ని చూచి అందరూ విస్తుపోయారు.

## 34. ఊచచేతివానికి ఆరోగ్యం - మత్త 12,9-14

యేసు విశ్రాంతి దినాన ప్రార్థనా మందిరానికి వెళ్లాడు. అక్కడ చేయి చచ్చుపడిన రోగి వున్నాడు. పరిసయులు ప్రభువును తప్పుపట్టగోరి విశ్రాంతి దినాన వ్యాధులు నయం జేయవచ్చా అని అడిగారు. ప్రభువు విశ్రాంతి దినాన మీ గొర్రె గోతిలో పడితే మీరు దాన్ని బయటికి తీయరా? గొర్రె కంటె నరుడు శ్రేష్ఠుడు కాడా అని అడిగాడు. తర్వాత ఆ రోగి చేతిని నయం జేశాడు. యూద నాయకులు ఆగ్రహం చెంది అతన్ని చంపడానికి కుట్రలు పన్నారు.

## 35.పండ్రెండు మంది శిష్యులు -లూకా 6,12-16

ప్రభువు కొండకు పోయి రాత్రంతా ఏకాంతంగా తండ్రికి ప్రార్థన చేసికొన్నాడు. తండ్రి చిత్తాన్ని తెలిసికొన్న తర్వాత పండ్రెండు మంది శిష్యులను ఎన్నుకొన్నాడు. వాళ్లు మొదట అతనితో వుండి అతనినుండి అన్నీ నేర్చుకొంటారు. తర్వాత సువార్తను ప్రకటిస్తారు. క్రీస్తు తండ్రి వద్దకు వెళ్లిపోయిన తర్వాత అతని వుద్యమాన్ని కొనసాగిస్తారు. వాళ్లు పేతురు, అంద్రెయ, యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తలోమయి, మత్తయి, తోమా అల్ఫయి కుమారుడైన యాకోబు, దేశభక్తుడైన సీమోను, యూదా, అతనిని అప్పగించిన యూదా. ప్రభువు వారికి అద్భుతాలు చేసే శక్తినీ, దయ్యాలను పారదోలే శక్తినీ దయచేశాడు. వాళ్లు ధనం మీదా పలుకుబడి మీదా ఆధారపడకూడదు. కేవలం దైవబలాన్ని నమ్మి బోధ చేయాలి. పావురాల్లలాగ నిష్కపటంగాను, పాముల్లాగా జాగ్రత్తగాను మెలగాలి.

## 36. యోహాను మరణం -మత్త 14,6-12

స్నాపక యోహాను తన్ను మందలించినందున హెరోదు కోపించి అతన్ని చంపించగోరాడు. కాని ప్రజలకు భయపడ్డాడు. ఆ రాజు జన్మదినాన హేరోదియా కొమార్తె నాట్యంచేసి అతన్ని మెప్పించింది. రాజు నీవు ఏ మడిగినా యిస్తానని అందరియెదుట ప్రమాణం చేశాడు. తల్లి

ఆమెను యోహాను శిరస్సును అడగమని ప్రోత్సహించింది. ఆ బాలిక యోహాను శిరస్సును ఓ పళ్లెంలో పెట్టి యిప్పించమని రాజుని కోరింది. అతడు అందరి యెదుట మాట యిచ్చినందున తప్పించుకోలేక పోయాడు. సేవకుణ్ణిపంపి చెరలోవున్న యోహాను తల నరికించి తెప్పించి బాలికకు ఇచ్చాడు. ఆమె దానిని తల్లికి అందించింది. యోహాను శిష్యులు గురువు దేహాన్ని గౌరవ పూర్వకంగా పాతిపెట్టారు.

## 37. ఐదువేల మందికి ఆహారం -మత్త 14,13-21

యేసూ శిష్యులూ ఓ నిర్జన ప్రదేశంలో వున్నారు. ఐనా అక్కడ కూడ ఐదువేల మంది జనం అతని చుట్టూ ప్రోగయ్యారు. ప్రభువు వారి వ్యాధిబాధలు కుదిర్చాడు. సాయంకాలం ఆ ప్రజలకు ఆహారం పెట్టమని శిష్యులతో చెప్పాడు. అప్పుడు శిష్యుల దగ్గర ఐదు రొట్టెలు రెండుచేపలు మాత్రమే వున్నాయి. అంతమంది జనానికి అవి యేలా సరిపోతాయి? ప్రభువు ప్రార్థన చేసి వాటిని త్రుంచి శిష్యులకిచ్చాడు. శిష్యులు వాటిని ప్రజలకు పంచిపెట్టగా అవి ఐదువేలమందికి సరిపోయి ఇంకా మిగిలేలా పెరిగి పోయాయి.

## 38. నీటిపై నడవడం -మత్త 14,22-33

ప్రభువు ప్రార్థన చేసికోవడానికి ఏకాంత స్థలానికి వెళ్లాడు. ఆ సాయంకాలం శిష్యులు పడవనెక్కి సరస్సులో ప్రయాణం చేస్తున్నారు. గాలి ప్రతికూలంగా వీస్తున్నందువలన వారి పడవ దూరంగా కొట్టుకొని పోయింది. వేకువజామున ప్రభువు నీటిపై నడచి వారి వద్దకు వచ్చాడు. శిష్యులు అతన్ని చూచి దయ్యమనుకొని భయంతో కేకలువేశారు. ప్రభువు నేనే గదా భయపడకండి అన్నాడు. పేతురు ప్రభూ! నీవే ఐతే నేను కూడ నీటిమీద నడచి నీ వద్దకు వచ్చేలా చేయి అన్నాడు. యేసు రమ్మనగానే పేతురు పడవదిగి నీటిమీద కాసేపు నడచాడు. ఆ మీదట వేగంగా వీచే గాలికి భయపడి నీటిలో మునగడం మొదలెట్టాడు. ప్రభూ! నన్ను కాపాడు

అని కేకలు వేశాడు. యేసు అతని చేయి పట్టుకొని నీకు చాలినంత విశ్వాసం  లేదు. నీవు ఎందుకు సందేహించావు అని అడిగాడు. ఆ మీదట ఇద్దరూ పడవనెక్కగా గాలి ఆగిపోయింది. శిష్యులు నీవు దేవుని కుమారుడవు అని పల్కి క్రీస్తుకి మొక్కారు.

## 39. కనానీయ స్త్రీ విశ్వాసం -మత్త 15,21-28

యేసు అన్యజాతి ప్రజలు వసించే తూరు, సీదోను ప్రాంతాలకు వెళ్లాడు. అక్కడో కనానీయ స్త్రీ అతని దగ్గరికి వచ్చి అయ్యా! నా కొమార్తెను దయ్యంపట్టి పీడిస్తూంది. ఆమెను బాగుచేయి అని వేడుకొంది. ప్రభువు సమాధానం చెప్పలేదు. శిష్యులు ఆమెను గురువుకి సిఫార్సు చేశారు. అతడు పిల్లలు తినే రొట్టెలను కుక్క పిల్లలకు వేస్తామా అని జవాబిచ్చాడు. అనగా నేను యూదులకు సహాయం చేయడానికి వచ్చాను గాని అన్యజాతి వారికి కాదు అని క్రీస్తు భావం. ఆ స్త్రీ తన్ను కుక్కతో పోల్చినందుకు ఏ మాత్రం బాధపడలేదు. అయ్యా! యజమానుని బల్లమీది నుండి జారిపడిన రొట్టెముక్కలను కుక్కపిల్లలు కూడ తింటాయి కదా అంది. ప్రభువు ఆమె వినయాన్ని మెచ్చుకొని నీ విశ్వాసం గొప్పది అన్నాడు. ఆ క్షణమే ఆమె బిడ్డకు ఆరోగ్యం చేకూరింది.

## 40. పేతురుకు ప్రధానాధికారం -మత్త 16,13-20

యేసు శిష్యులతో ప్రయాణం చేస్తూ కైసరయా ఫిలిప్పి ప్రాంతానికి వచ్చాడు. అక్కడ ప్రజలు మనుష్య కుమారుడు ఎవరని చెప్పుకొంటున్నారు అని శిష్యులను అడిగాడు. వాళ్లు యోహాను లేక ఏలీయా లేక యిర్మీయా అని వాకొంటున్నారు అని చెప్పారు. మరి మీ దృష్టిలో నేనెవరిని అని క్రీస్తు మళ్లా అడిగాడు. పేతురు శిష్యుల తరఫున జవాబు చెప్తూ అయ్యా! నీవు మెస్సీయావి అన్నాడు. ప్రభువు సంతోషించి  సీమోనూ! నీవు ధన్యుడివి. పరలోకంలోని తండ్రే నీకీ విషయం తెలియజేశాడు. నీ పేరు పేతురు లేక రాయి. ఈ రాతిమీద నా సమాజాన్ని నిర్మిస్తాను. నరక

శక్తులు దాన్ని జయించలేవు. నా సమాజం మీద నీకు సర్వాధికారం వుంటుంది అని చెప్పాడు. క్రీస్తు చెప్పినట్లే పేతురు అతని సమాజానికి ప్రధానాధికారి అయ్యాడు.

## 41. దివ్యరూప ధారణం - మత్త 17,1-8

యేసు ముగ్గురు శిష్యులతో కొండమీదికి వెళ్లి మారు రూపం పొందాడు. అతని ముఖం సూర్యునిలా ప్రకాశించింది. దుస్తులు తళతళ మెరిశాయి. మోషే యేలీయాలు కన్పించి అతనితో మాటలాడారు. పేతురు ఆదర్శనం వల్ల ఉత్తేజితుడై ప్రభూ! మనం ఇక్కడే వుండిపోతే బాగుంటుంది. నేను మీ ముగ్గురికి మూడు గుడారాలు నిర్మిస్తాను అని పల్కాడు. అప్పుడు మేఘం నుండి తండ్రి ఇతడు నాకు ఇష్టుడైన కుమారుడు. ఇతని వలన నాకు సంతోషం కలిగింది. మీరు ఇతని బోధ వినండి అని పల్కాడు. ఆ స్వరానికి శిష్యులు భయపడి బోరగిలబడ్డారు. యేసు వారికి అభయమిచ్చాడు.

## 42. చేపనోటిలో నాణెం -మత్త 17,24-27

గుడిపన్ను వసూలు చేసేవాళ్లు మీ గురువు పన్ను చెల్లించాలి కదా అని పేతురుని అడిగారు. యేసు పేతురుతో దేవుని కుమారుడు పన్ను చెల్లించ నక్కరలేదు. ఐనా మనం వీరికి చెడ్డ ఆదర్శం చూపించకూడదు. నీవు సరస్సుకి వెళ్లి గాలం వేయి. నీకు మొదట చిక్కిన చేపనోటిలో నాణెం దొరుకుతుంది. దాన్ని పన్నుగా చెల్లించు అని చెప్పాడు. శిష్యుడు ప్రభువు చెప్పినట్లే చేశాడు.

## 43. ఎవడు గొప్పవాడు? -మత్త 18,1-5

శిష్యులు లోక వ్యామోహంలో పడిపోయి పరలోక రాజ్యంలో గొప్పవాడు ఎవడు అని గురువుని అడిగారు. ప్రభువు మీరు చిన్న బిడ్డల్లా ఐతేనే తప్ప పరలోక రాజ్యంలో చేరలేరని చెప్పాడు. వాళ్లు త్రోవలో మనలో గొప్పవాడు ఎవడని వాదించుకొన్నారు. క్రీస్తువారికి ఓ చిన్న బిడ్డణ్ణి ఆదర్శంగా చూపి మీరు వీడిలా మారాలని చెప్పాడు. శిష్యులు

అధికారం నెరపేవాడు గొప్పవాడు అనుకొన్నారు. క్రీస్తు పసికందులాగ వినయంగా వుండేవాడు, ఇతరులకు సేవలు చేసే వాడు గొప్పవాడు అని చెప్పాడు. వాళ్లు పాఠం నేర్చుకొన్నారు.

## 44. చిన్నబిడ్డలను దీవించడం - మార్కు 10,13-16

ఒక పర్యాయం తల్లులు బిడ్డలను క్రీస్తు దగ్గరికి తీసికొని వచ్చి వారిని దీవించమని అడిగారు. కొని శిష్యులు వారిని ప్రక్కకు నెట్టారు. ప్రభువు శిష్యులను మందలించి పసిబిడ్డలను నా చెంతకు రానీయండి. ఈ పిల్లల్లాంటి వారికే దైవరాజ్యం దక్కుతుంది. పసిబిడ్డల మనస్తత్వం అలవర్చుకొంటే గాని నరులు దైవరాజ్యంలో ప్రవేశించలేరు అని చెప్పాడు. అటుపిమ్మట ఆ బిడ్డలను ఎత్తి కౌగిలించుకొని వారిని దీవించాడు.

## 45. తోడివారిని క్షమించాలి -మత్త 18,21-34

ఒకరాజుకి ఒక సేవకుడు పెద్దమొత్తం అప్పుపడివున్నాడు. కాని అతడు బాకీ చెల్లించలేని పరిస్థితిలో వున్నాడు. రాజు జాలిపడి అతని అప్పంతా క్షమించాడు. ఈ సేవకునికి మరో సేవకుడు కొద్దిమొత్తం బాకీ పడి వున్నాడు. అతడు కూడ బాకీ చెల్లించలేని పరిస్థితిలోనే వున్నాడు. ఐనా ఇతడు దయలేక, అప్పు తీర్చనందుకు అతన్ని చెరలో త్రోయించాడు. రాజుకి ఈ సంగతి తెలిసింది. అతడు మొదటి సేవకునిపై మండిపడి నేను నిన్ను క్షమించినట్లే నీవు కూడ నీ పొరుగువాణ్ణి క్షమించాలి కదా అన్నాడు. అతన్ని శిక్షించడానికి తలారులకు అప్పగించాడు. క్రీస్తు ఈ సామెత చెప్పి ఒకరి అపరాధాలను ఒకరు క్షమించాలని బోధించాడు.

## 46. నడుము వంగిన స్త్రీ - లూకా 13,10-17

యేసు విశ్రాంతి దినాన ప్రార్థనా మందిరంలో బోధిస్తున్నాడు. 18 ఏండ్ల నుండి రోగియై నడుము వంగిపోయివున్న ఓ స్త్రీ అక్కడికి వచ్చింది. ప్రభువు ఆమె వ్యాధిని కుదర్చగా తిన్నగా నిలబడింది. ప్రార్థనా మందిరాధికారికి యేసు విశ్రాంతి దినాన అద్భుతం చేయడం నచ్చలేదు. అతడు పనిచేయడానికి వారంలో ఆరురోజులు వున్నాయి కదా! ఆ రోజుల్లో

వచ్చి ఆరోగ్యాన్ని పొందండి. విశ్రాంతి దినాన కాదు అన్నాడు. కాని ప్రభువు విశ్రాంతి దినాన మీ పశువులను నీళ్లు పెట్టడానికి తోలుకొని పోతున్నారు కదా! ఇన్ని యేండ్లనుండి బాధపడుతున్న ఈమెను విశ్రాంతి దినాన వ్యాధి బంధాల నుండి విడిపిస్తే తప్పేమిటి అన్నాడు. అక్కడివాళ్లు ఆ యద్భుతాన్ని చూచి సంతోషించారు.

## 47. మంచి సమయరయుడు -లూకా 18

అక్కరలో వున్నవారికి సహాయం చేయాలని చెప్తూ క్రీస్తు ఈ సామెత చెప్పాడు. ఒక యూదుడు యెరికోకు వెళ్తూండగా దొంగలు వాణ్ణి చితకబాది దోచుకొని కొనవూపిరితో వదలి వెళ్లారు. ఓ యాజకుడు ఆ దారిన పోతూ అతన్ని చూచికూడ పట్టించుకోకుండ వెళ్లిపోయాడు. ఆలాగే ఓ లేవీయుడు కూడ ఆ దారిన వెళ్తూ పట్టించుకోకుండ ప్రక్కకు తొలగిపోయాడు. అటుపిమ్మట ఓ సమరయుడు ఆ త్రోవ వెంటవచ్చి అతన్ని చూచి జాలి పడ్డాడు. అతని గాయాలకు కట్టుకట్టి సత్రానికి తీసికొని పోయాడు. సత్రం యజమానునికి డబ్బు చెల్లించి నీవు ఇతన్ని పరామర్శించు. ఎక్కువ డబ్బు అసరమైతే నేను మళ్లా వచ్చినప్పుడు చెల్లిస్తాను అని చెప్పాడు. ఈ సమరయునిలాగే మనం కూడ ఆపదలో వున్నవారిని ఆదుకోవాలి.

## 48. జక్కయ - లూకా 19,1-10

యేసు యెరికో నగరానికి వచ్చాడు. అక్కడ జక్కయ అనే సుంకరుల నాయకుడు వున్నాడు. అతనికి యేసుని కన్నులార చూడాలనే కోరిక పుట్టింది. కాని పొట్టివాడుకావడంచే పెద్ద గుంపు మధ్యలో వున్న క్రీస్తుని చూడలేక పోయాడు. కనుక అక్కడవున్న ఓ మేడిచెట్టు నెక్కాడు. ప్రభువు అక్కడికి వచ్చి జక్కయా! త్వరగా దిగిరా. నేను మీ యింటికి అతిథిగా వస్తాను అన్నాడు. జక్కయ సంబరంతో ప్రభువుని ఆహ్వానించాడు. కాని చుట్టుపట్ల వున్న జనం ఈయన ఈ పాపాత్ముని యింటికే వెళ్లాలా

అని గొణుగుకొన్నారు. జక్కయ పన్నులు వసూలుచేయడంలో మోసాలు చేసేవాడు. కాని ప్రభువు సాన్నిధ్యం వలన అతనికి పశ్చాత్తాపం పుట్టింది. కనుక క్రీస్తుతో నా ఆస్తిలో సగం పేదలకు ఇచ్చివేస్తాను. నేను ఎవరినైన మోసగించి నట్లయితే నాల్గు వంతులు నష్టపరిహారం చేస్తాను అన్నాడు. క్రీస్తు సంతోషించి ఈరోజు ఈ కుటుంబానికి రక్షణం లభించింది. మనుష్య కుమారుడు పాపులను రక్షించడానికే వచ్చాడు అని పల్కాడు.

## 49. బర్తిమయికి చూపు - మార్కు 10,46-52

ప్రభువు యెరికో పట్టణానికి వస్తున్నాడు. దారిలో బర్తిమయి అనే బిచ్చగాడు త్రోవ ప్రక్కన కూర్చుండి బిచ్చం అడుగుకొంటున్నాడు. అతడు ప్రభువు ఆ దారినే వస్తున్నాడని విని అయ్యా! నన్ను కరుణించు అని అరచాడు. చుట్టుపట్ల వున్న జనం నీ నోరు మూయమని దబాయించారు. ప్రభువు అతన్ని తన దగ్గరికి రమ్మని పిల్చి నీకు ఏమి కావాలని అడిగాడు. బిచ్చగాడు నాకు చూపు దయచేయి అని వేడుకొన్నాడు. ప్రభువు నీ విశ్వాసమే నీకు ఆరోగ్యాన్ని చేకూర్చింది అన్నాడు. వెంటనే అతడు చూపుని పొంది క్రీస్తు వెంట పోయాడు.

## 50. మరియా మార్తలు - లూకా 10,38-42

యేసు బెతానియా గ్రామంలోని మరియా మార్తల యింటికి వచ్చాడు. మార్త ప్రభువుకి మంచి భోజనం తయారుచేయడానికి పూనుకొంది. కాని మరియ ప్రభువు పాదాల దగ్గర కూర్చుండి అతని బోధలు వింటూంది. మార్త వంటపనులన్నీ నా నెత్తిన పడ్డాయి. చెల్లెలిని గూడ వచ్చి సహాయం చేయమని చెప్పండి అని అడిగింది. కాని ప్రభువు మార్తా! నీవు చాల పనులతో సతమతం ఔతున్నావు. పరలోకంలోని తండ్రిని గూర్చి వినడం ముఖ్యం. మరియ ఆ పని చేస్తూంది. ఆమె ఆలాగే వింటూ వుంటంది అని చెప్పాడు. భక్తుడు రోజూ కాసేపు బైబులు ముందు కూర్చుండి ఆ గ్రంథం నుండి ప్రభువుబోధలు వింటూండాలి.

## 51. ద్రాక్షతోట ఉపమానం - యోహా 15,1-6

ప్రభువు ద్రాక్షతోట ఉపమానం చెప్తూ శిష్యులతో ఈలాగన్నాడు. నేను ద్రాక్ష తీగను. మీరు నాలోనికి అతుకుకొన్న కొమ్మలు. మీరు నా యందు నిల్చి వుంటే చక్కగా ఫలిస్తారు. నా నుండి వేరైపోతే యెండిపోతారు. కనుక నిరంతరం నాతో ఐక్యమై వుండండి అని చెప్పాడు. ప్రభువుతో ఐక్యమై వుంటే అతని జీవాన్ని పొంది మనం కూడ పవిత్ర జీవితం గడుపుతాం.

## 52. మంచి కాపరి - యోహా 10, లూకా 15

యేసు తాను మంచి కాపరినని చెప్పాడు. అతడు తనగొర్రెల కొరకు ప్రాణాలు అర్పించేవాడు. జీతగాడు తోడేలు రాగానే మందను విడచి పారిపోతాడు. కాని క్రీస్తు మంద కొరకు ప్రాణాలు అర్పిస్తాడు. ప్రభువుకి తన గొర్రెలు తెలుసు. ఆ గొర్రెలకూ ప్రభువు తెలుసు. ప్రభువు మందకు చెందని గొర్రెలు కూడ వున్నాయి. వాటిని గూడ తోలుకొని రావాలని అతని కోరిక.

ఓ కాపరికి నూరు గొర్రెలు వున్నాయి. వాటిల్లో వొకటి తప్పిపోయింది. అతడు 99 గొర్రెలను వదలిపెట్టి తప్పిపోయినదాని కొరకు వెదికాడు. అది దొరికిన తర్వాత యింటికి తీసికొని వచ్చి మిత్రులను గూడ పిలవగా అందరూ వచ్చి ఆనందించారు. ఈ కాపరి క్రీస్తే. అతడు నెనరుతో పాపులను వెదకి దైవరాజ్యంలో చేర్చేవాడు.

## 53. తప్పిపోయిన కుమారుడు - లూకా 15

ఒక తండ్రికి ఇద్దరు కొడుకులు వున్నారు. చిన్నవాడు తన ఆస్తిని పంచుకొని దూరప్రాంతాలకు వెళ్లిపోయాడు. అక్కడ భోగవిలాసాలతో ఆస్తినంతటినీ ఖర్చుబెట్టాడు. అంతలో పెద్ద కరువు వచ్చింది. అతడు ఓ యజమానునికి జీతానికి కుదరగా పందులు మేపే పని వాని పాలబడింది. ఆ కరువు కాలంలో వానికి పందులు తినే పొట్టు కూడ దొరకలేదు. అతడు కనువిప్పు కలిగి తండ్రి దగ్గరికి తిరిగి వచ్చాడు. నాన్నా! నేను నీకూ

దేవునికీ ద్రోహం చేశాను. ఇప్పుడు నీ కుమారునిగా వుండదగను. సేవకుణ్ణిగా పెట్టుకో అని వేడుకొన్నాడు. కాని తండ్రి అతన్ని కౌగిలించుకొని ఆదరంతో స్వీకరించాడు. క్రొత్త బట్టలు తొడిగించి పెద్ద విందు చేశాడు. మరణించిన నా కుమారుడు మళ్లా బ్రతికాడు అనుకొని సంబరాలు పడ్డాడు. అంతలో పెద్ద కుమారుడు ఇంటికి వచ్చాడు. అతనికి ఈ విందు వినోదాలు నచ్చలేదు. ఆస్తి పాడుచేసి వచ్చిన కుమారునికి విందు జరపడమేమిటని కోపించాడు. కాని తండ్రి అతన్ని శాంతపరచి చనిపోయినవాడు మళ్లా బ్రతికినందుకు సంతోషిద్దాం అని చెప్పాడు. క్రీస్తు ఈ  సామెత చెప్పి ఈ తండ్రిలాగే దేవుడు పాపుల పట్ల ఆదరం జూపుతాడని బోధించాడు.

## 54. పుట్టు గ్రుడ్డివానికి చూపు -యోహా 9

ఓ మారు క్రీస్తూ శిష్యులూ త్రోవన పోతూండగా ఓ పుట్టుగ్రుడ్డివాడు కన్పించాడు. శిష్యులు ఎవరి పాపం వలన ఇతడు గ్రుడ్డివాడయ్యాడు? ఇతని పాపం వల్లనా లేక తల్లిదండ్రుల పాపం వల్లనా అని అడిగారు. క్రీస్తు ఎవరి పాపంవల్లనా కాదు. ఇతని గ్రుడ్డితనం దేవునికి కీర్తి తెచ్చిపెడుతుంది అని చెప్పాడు. ఆ పిమ్మట ఉమ్మితో మట్టి కలిపి అతని కన్నులకు రాసి పోయి సిలోయము కొనేటిలో కడుగుకొమ్మని చెప్పాడు. అతడు ఆలాగే కడుగుకోగా చూపు వచ్చింది.

జనం విస్తుపోయి అతన్ని పరిసయుల వద్దకు కొనిపోయారు. యేసు విశ్రాంతి దినాన ఆ యద్భుతాన్ని చేసినందున వాళ్లు అతన్ని తప్పుపట్టారు. పైగా అతడు పుట్టు గ్రుడ్డివాడు అని నమ్మక అతని తల్లిదండ్రులను పిలిపించారు. వాళ్లు అతడేమో పుట్టుగ్రుడ్డే. కాని చూపు ఎలా వచ్చిందో మాకు తెలియదు. మీరు అతన్నే అడగండి అని తప్పుకొన్నారు.

పరిసయులు గ్రుడ్డివాణ్ణి మళ్లా ప్రశ్నించారు. అతడు పుట్టుగ్రుడ్డికి

ఎవరైన చూపు ఈయ గలరా? ఆ యేసు దేవుని వద్ద నుండి వచ్చినవాడు కాకపోతే ఈ పని ఏలా చేయగలిగాడు అని ప్రశ్నించాడు. పరిసయులు పాపంలో పుట్టిన నీవు మాకు బోధిస్తున్నావా అని అతన్ని వెలివేశారు. వాళ్లు చూపు రావడంలోని అద్భుతాన్ని పట్టించుకోలేదు. విశ్రాంతి దినాన పని చేయకూడదు అనే నియమాన్ని మీరినందుకు యేసుని తప్పుపట్టారు.

తర్వాత యేసు ఆ గ్రుడ్డివానిని కలసికొని నీవు మనుష్య కుమారుని విశ్వసిస్తూన్నావా అని అడిగాడు. నమ్ముతున్నాను అని చెప్పి అతడు ప్రభువుని ఆరాధించాడు. యేసు నేను చూపు లేనివారికి చూపు ఈయడానికి వచ్చాను. మేము చూడగలం అనుకొనేవారికి చూపులేదని తెలియజేయడానికి కూడ వచ్చాను అని చెప్పాడు.

## 55. అవివేకియైన ధనికుడు - లూకా 12,13-21

ఒక పర్యాయం ఒకడు బోధకుడా! మా తండ్రి ఆస్తిని పంపిణీ చేయమని మీరు మా అన్నతో చెప్పండి అని క్రీస్తుని అడిగాడు. నరులు వస్తువ్యామోహంలో పడి దురాశకు లొంగకూడదు అనడానికి క్రీస్తు ఈ క్రింది సామెత చెప్పాడు. ఒక ధనవంతునికి పంటలు బాగా పండాయి. అతడు నా కొట్లు పడగొట్టించి ఇంకా పెద్దకొట్లు కట్టిస్తాను. నా ధాన్యమంతా వాటిలో నిల్వజేస్తాను. చాల కాలం తిని త్రాగి ఆనందిస్తాను అని తనలో తాను అనుకొన్నాడు. కాని దేవుడు ఓరీ అవివేకీ! ఈ రాత్రే నీవు చనిపోతావు సుమా! ఆ మీదట నీవు కూడబెట్టినవి ఎవరు అనుభవిస్తారు అన్నాడు. ఈ లోకంలో ధనం కూడబెట్టుకుంటే చాలదు, పరలోకంలో కూడబెట్టుకోవాలి.

## 56. కాయలు కాయని అంజూరం - లూకా 13,6-9

ప్రభువు కాయలు కాయని అంజూరం ఉపమానం చెప్పాడు. ఒక రైతు తన తోటలో అంజూరపు చెట్టు నాటించాడు. అది మూడేండ్లయినా కాయలు కాయలేదు. రైతు నిరాశ చెంది దాన్ని నరికివేయమని తోటమాలితో చెప్పాడు. అతడు ఇంకో యేడు చూద్దాం.

కాపు పట్టకపోతే అప్పుడే నరికివేద్దాం అన్నాడు. పాపి త్వరగా పశ్చాత్తాప పడాలి. లేకపోతే అతనికి దేవుని శిక్ష తప్పదు.

## 57. పదిమంది కుష్ఠరోగులు -లూకా 17,11-19

ఒక గ్రామం వెలుపల పదిమంది కుష్ఠరోగులు వున్నారు. యేసుని చూడగానే వాళ్లు అయ్యా! మా పై దయజూపు అని వేడుకొన్నారు. ప్రభువు వారిని అర్చకుల వద్దకు పంపాడు. కుష్ఠలేదని ధ్రువీకరించేది వాళ్లే. ఆ రోగులకు దారిలోనే కుష్ఠ నయమైంది. వారిలో ఒకడు మాత్రం తిరిగివచ్చి ప్రభువుకి నమస్కారం చెప్పాడు. అతడు కూడ యూదుడు కాదు సమరయుడు. ప్రభువు పదిమందికి నయమైతే దేవునికి వందనాలు చెప్పేది ఒక్కడేనా అని అడిగాడు. దేవుడు తాను మనకు దయచేసిన నానా వరాలకు మనం కృతజ్ఞులమైవుండాలని కోరుకొంటాడు. ఐనా ఆ మంచిగుణం చాలామందిలో వుండదు.

## 58. పరిసయుడు - సుంకరి - లకా 18,9-14

ఇద్దరు నరులు ప్రార్థనకు దేవాలయానికి వెళ్లారు. ఒకడు పరిసయుడు, మరొకడు సుంకరి. పరిసయుడు దేవుని యెదుట తన్ను తాను పొగడుకొన్నాడు. నేను భక్తి మంతుణ్ణి, ఉపవాసాలు చేసేవాణ్ణి, నా ఆదాయంలో పదోవంతు చెల్లించేవాణ్ణి. నేను ఇతర పాపుల్లాంటి వాణ్ణి కాను అని చెప్పుకొన్నాడు. సుంకరి పీఠానికి దూరంగా నిలబడి రొమ్ము బాదుకొని దేవా! నేను పాపిని, నన్ను కరుణించు అని వేడుకొన్నాడు. దేవుడు పరిసయుని త్రోసిపుచ్చి సుంకరి ప్రార్థన ఆలించాడు. నేను మంచివాణ్ణి ఇతరులు చెడ్డవాళ్లు అనుకోవడం తగదు. దేవుని యెదుట మన తప్పిదాలను మనం ఒప్పుకోవాలి.

## 59. ధనిక యువకుడు - మత్త 19,16-26

ఓ ధనిక యువకుడు క్రీస్తుని సమీపించి మోక్షాన్ని పొందడానికి నేనేమి చేయాలి అని అడిగాడు. ప్రభువు పదియాజ్ఞలను పాటించు అని చెప్పాడు. ఆ యువకుడు అయ్యా! నేను చిన్నప్పటి నుండి వీటిని పాటిస్తూనే

వున్నాను అని చెప్పాడు. ప్రభువు నీవు పరిపూర్ణుడివి కాగోరితే నీ యాస్తిపాస్తులను అమ్మి పేదలకు దానం చేయి. ఆ పిమ్మట వచ్చి నన్ను అనుసరించు అని చెప్పాడు. కాని ఆ యువకునికి తన సంపదలు వదలు కోవడం ఇష్టం లేదు. కనుక యేసు పలుకులు విని బాధతో వెళ్లిపోయాడు. ఆ పిమ్మట ప్రభువు శిష్యులతో ధనవంతుడు దైవరాజ్యంలో ప్రవేశించడం కంటె ఒంటె సూది బెజ్జంలో దూరడం సులభం. ఐనా దేవుడు దనవంతుల బుద్ధిని మార్చి వారికి గూడ రక్షణాన్ని ప్రసాదించగలడు అని చెప్పాడు.

## 60. ద్రాక్షతోటలో కూలీలు - మత్త 20,1-16

క్రీస్తు దైవరాజ్యం ఈలా వుంటుందని తెలియజేయడానికి ఓ సంఘటనం చెప్పాడు. ఒక ద్రాక్షతోట యజమానుడు కూలీల కొరకు వెదుకుతున్నాడు. ఉదయాన్నే సంత వీధిలోని కూలీలను చూచి రోజుపనికి ఒక దీనారం చెల్లించే ఒప్పందంపై వారిని తోటకు పంపాడు. తిరిగి తొమ్మిదిగంటలకు, పన్నెండు గంటలకు, మధ్యాహ్నం మూడు గంటలకు, ఐదు గంటలకు కూడ కూలీలను ఆలాగే తోటకు పంపాడు. సాయంకాలం కూలీ డబ్బులుఈయడం చివరనవచ్చిన జట్టుతో ప్రారంభించారు. వారికి ఒక దీనారం ముట్టింది. మొదట వచ్చిన వాళ్లకు కూడ ఒక దీనారమే యిచ్చారు. మొదటి జట్టు వాళ్లు మేము ఎక్కువకాలం పని చేశాం గనుక మాకుఎక్కువ కూలి రావాలి కదా అని గొణిగారు. యజమానుడు నేను న్యాయం తప్పలేదు. మీకు యిస్తానని వొప్పుకున్న కూలి యిచ్చానుగదా! ఆలస్యంగా వచ్చిన వారిమీద దయకలిగి వారికి కూడ నిండు కూలి యిచ్చాను. నా సొమ్ము నేను ఉదారంగా వెచ్చించాను. మీకు బాధ యెందుకు అన్నాడు. దేవుడు కరుణ కలలాడు. అతని కొరకు కొద్దికాలం శ్రమజేసినా ఫలితం దక్కుతుంది.

## 61. లాజరుని జీవంతో లేపడం - యోహా 11

బెతానియాలోని మార్తా మరియల తమ్ముడు లాజరు జబ్బు పడ్డాడు. అక్కాచెల్లెళ్లు క్రీస్తుకి కబురు పెట్టారు. ఐనా ప్రభువు రెండు

రోజులదాక బెతానియాకు పోలేదు. ఆ పిమ్మట శిష్యులతో లాజరు మరణించాడు, బెతానియాకు వెళ్దాము అని చెప్పాడు. వాళ్లు ఆ వూరు చేరుకోగానే మార్త ఎదురువచ్చి ప్రభూ! నీవు ఇక్కడ వున్నట్లయితే నా తమ్ముడు మరణించేవాడు కాదు అంది. ప్రభువు అతడు మరల లేస్తాడు అని చెప్పాడు. మార్త ఔను! పునరుత్థానకాలంలో లేస్తాడు అంది. యేసు నేనే పునరుత్థానాన్ని. నన్ను విశ్వసించేవాడు మరణించినా మళ్లా జీవిస్తాడు అని పల్కాడు. మార్త నీవే మెస్సీయావని నమ్ముతున్నాను అని చెప్పింది. అంతలో మార్త పిలువగా ఇంటిలో నుండి మరియ కూడ వచ్చి ప్రభూ! నీవు ఇక్కడ వున్నట్లయితే మా తమ్ముడు చనిపోయేవాడు కాదు అంది. ప్రజలు లాజరు సమాధిని క్రీస్తుకి చూపించారు. అతన్ని తలంచుకొని క్రీస్తు కన్నీరు కార్చాడు. లాజరు మీద యితనికి ఎంత ప్రేమ అని ప్రజలు విస్తుపోయారు.

లాజరుని రాతితో మూసివేసిన కొండ గుహలో పాతిపెట్టారు. క్రీస్తు రాతిని తొలగించండి అన్నాడు. కాని మార్త ప్రభూ! తమ్ముడు చనిపోయి నాల్గు రోజులైనది. రాతిని తొలగిస్తే దుర్వాసన వస్తుంది అని చెప్పింది. ప్రభువు నీవు విశ్వసించావంటే దేవుని శక్తిని చూస్తావు అని చెప్పాడు. పిమ్మట క్రీస్తు తండ్రీ! నీవు నా మనవిని ఆలించినందులకు నీకు వందనాలు చెప్తున్నాను అని పల్కాడు. అటు తర్వాత లాజరూ! నీవు సమాధినుండి వెలుపలికి రా అని ఆజ్ఞాపించాడు. వెంటనే లాజరు లేచి బయటికి వచ్చాడు. అతని కాళ్లు, చేతులు, ముఖం బట్టలతో చుట్టబడివున్నాయి. యేసు ఆ కట్లు విప్పి అతన్ని వెళ్లిపోనీయండి అని ఆదేశించాడు.

క్రీస్తు చేసిన అద్భుతాన్ని తెలిసికొని యూద నాయకులు భయపడ్డారు. ఇతడు ఈలా అద్భుతాలు చేస్తుంటే ప్రజలంతా యితని చుట్టూ గుంపు గూడతారు. మెస్సీయా రానే వచ్చాడని రోమీయుల మీద తిరగబడతారు. అపుడు రోమీయులు వచ్చి మనలను నాశం జేస్తారు

అనుకొన్నారు. ప్రధానార్చకుడైన కయిఫా మన జాతి అంతా నాశం గావడంకంటే ఒక్కడు దాని తరఫున మరణించడం మేలు అన్నాడు. క్రీస్తు మరణాన్ని ఉద్దేశించే అతడు ఈలా పల్కాడు. కాని ప్రభువు ఒక్క యూదజాతి కొరకు మాత్రమే కాక దేవుని బిడ్డలందరి కొరకు మరణిస్తాడు.

## 62. మరియ క్రీస్తుకి అభిషేకం చేయడం - యోహా 12,1-11

బెతనియాలో క్రీస్తుకి విందు చేశారు. క్రీస్తుతోపాటు చనిపోయి లేచిన లాజరు కూడ ఆ విందులో పాల్గొన్నాడు. మరియ పరిమళద్రవ్యం తెచ్చి భక్తిభావంతో యేసు పాదాలకు పూసి వాటిని తలవెంద్రుకలతో తుడిచింది. యూదా యిస్కారియోతు దీన్ని మూడు వందల దీనారాలకు అమ్మి ఆ సొమ్ముతో పేదలకు దానం చేయవచ్చు గదా అన్నాడు. అతనికి పేదలపట్ల జాలి యేమీ లేదు. శిష్యుల ఉమ్మడి సొమ్ము అతని దగ్గర వుండేది. దానినుండి అతడు కొంత కాజేస్తుండే వాడు. ఇప్పుడీ సొమ్ము నుండి గూడ తన వాటా కొట్టేయవచ్చు గదా అని అతని ఉద్దేశం. కాని ప్రభువు మరియ కోపు తీసికొన్నాడు. ఆమెను ఈ సుగంధద్రవ్యం పూయనీయండి. నా భూస్థాపనాన్ని సూచిస్తూ ఆమె ఈ కార్యం చేసింది. పేదలు ఎప్పుడూ వుంటారు. వారికి మీరు ఎప్పుడైన సహాయం చేయవచ్చు. నేను ఎల్లప్పుడు మీతో వుండను గదా అన్నాడు. అప్పటికే యూద నాయకులు క్రీస్తునీ లాజరునీ చంపాలని ఆలోచిస్తూన్నారు. కనుక మరియ క్రీస్తు భూస్థాపనాన్ని ముందుగానే పసిగట్టి ఈ కార్యం చేసింది.

## 63. క్రీస్తు యెరూషలేము ప్రవేశించడం - మత్త 21,1-11

యేసు శిష్యులను పిలచి బెత్ఫగే గ్రామంలోని గాడిదనూ దాని పిల్లనూ తోలుకొని రమ్మన్నాడు. శిష్యులు ఆలాగే చేసి గాడిదపై బట్టలు కప్పారు. యేసు దానిపై కూర్చుండి యెరూషలేము ప్రవేశించాడు. ప్రభువుని చూడ్డానికి చాలమంది జనం ప్రోగయ్యారు. కొందరు దారి

పొడుగున  బట్టలుపరిచారు. మరికొందరు చెట్ల రెమ్మలునరికి త్రోవలో పడవేశారు. ప్రజలు దావీదు కుమారునికి జయం, ప్రభువు పేరిట వచ్చువానికి స్తుతులు అని అరచారు. ఈయన నజరేతు నుండి వచ్చిన ప్రవక్త అని చెప్పుకొన్నారు. మెస్సీయా గాడిదనెక్కి వినయంగా వస్తాడని జెకర్యా ప్రవక్త ముందుగానే చెప్పాడు. ఆ ప్రవచనం ఇప్పుడు నెరవేరింది.

## 64. వివాహపు విందు - మత్త 22,1-21

క్రీస్తు తన బోధలు ఆలింపని యూదులను గూర్చి ఈ సామెత చెప్పాడు. ఒకరాజు తన కుమారుని పెండ్లి విందు సిద్ధం జేసి అతిథులకు కబురు పంపాడు. కాని వాళ్లు రాలేదు. ఎవరి పనిలో వాళ్లు మునిగి వున్నారు. పైగా రాజు పంపిన సేవకులను చంపివేశారు. రాజు కోపించి వారిని నాశం జేసి వారి పట్టణాన్ని తగలబెట్టించాడు. అటుపిమ్మట అతడు పేదసాదలను విందుకు పిలిపించాడు. విందుశాల నిండి పోయింది. వచ్చిన వారిలో ఒకడు తగిన బట్టలు ధరించి రాలేదు. రాజు అతన్ని గెంటి వేయించాడు. యూదులు దైవరాజ్యాన్ని నిరాకరిస్తే నూత్నంగా వచ్చిన క్రైస్తవులు దాన్ని స్వీకరిస్తారని ఈ సామెత భావం.

## 65. సీజరుకి పన్ను - మత్త 22,15-22

పరిసయులకు క్రీస్తు బోధలు నచ్చలేదు. కనుక వాళ్లు అతన్ని ఇరకాటంలో పెట్టగోరి ఓ ప్రశ్న వేశారు. సీజరుకి పన్ను చెల్లించాలా వద్దా అని అడిగారు. చెల్లించమంటే యూదులకు కోపం. వద్దంటే రోమీయులకు  కోపం. కనుక ఏలా జవాబు చెప్పినా అతడు చిక్కుల్లో పడతాడని వాళ్ల వ్యూహం. కాని క్రీస్తు ఒక నాణెం చూపించమన్నాడు. దాని మీద సీజరు బొమ్మ వుంది. కనుక ప్రభువు సీజరుకి చెల్లించేవి సీజరుకీ, దేవునికి చెల్లించేవి దేవునికీ చెల్లించండి అని చెప్పాడు. ఆ జవాబు వినగా విరోధులకు నోటమాట రాలేదు.

## 66. విధవ కానుక - మార్కు 12,41-44

ప్రభువు దేవాలయంలో కూర్చుండి అక్కడ ప్రజలు కానుకలు

వేసే తీరును గమనిస్తున్నాడు. ఉమ్మెత్త పూవు ఆకారంలో వుండే పెట్టెల్లో ప్రజలు కానుకలు వేసేవాళ్ళు. ధనవంతులు వచ్చి పెద్దమొత్తాలే వేశారు. ఆ పిమ్మట ఓ పేద విధవ వచ్చి రెండు పైసలు మాత్రమే పెట్టెలో వేసింది. ప్రభువు కానుకలన్నిటిలోను ఆమె కానుక గొప్పది అన్నాడు. ధనవంతులకు చాల సొమ్ముంది. వాళ్ళ ఆ సొత్తులో కొంత భాగం మాత్రమే దేవుడికిచ్చారు. కాని ఈ పేదరాలికి వున్నది రెండుకాసులే. ఆమె తనకున్నదంతా దేవుణ్ణి నమ్మి అతనికిచ్చింది. ఆ పిమ్మట దేవుడే తన్ను పోషిస్తాడు అని నమ్మింది. దేవునికి ఎంత యిచ్చామన్నది గాదు, ఏలాంటి మనస్తత్వంతో ఇచ్చామన్నది ముఖ్యం.

## 67. పదిమంది కన్నెల సామెత - మత్త 25,1-13

రెండవ రాకడకు కనిపెట్టుకొని వుండాలి అనడానికి ప్రభువు ఈ కథ చెప్పాడు. పెండ్లి కుమారునికి స్వాగతం చెప్పడానికి పదిమంది కన్నెలు కాగడాలతో పోయారు. వారిలో ఐదుగురు తెలివితో కాగడాలతో పాటు మిగులు చమురు తీసికొని పోయారు. తతిమ్మా ఐదుగురు తెలివి లేనందున మిగులు చమురు తీసికొని పోలేదు. పెండ్లి కుమారుడు రావడానికి ఆలస్యమైంది. కనుక పదిమంది నిద్రపోయారు. అపరాత్రిలో పెండ్లి కుమారుడు రాగా అందరూ నిద్రలేచి కాగడాలు వెలిగించారు. కాని చమురు ఐపోయినందున తెలివిలేని కన్యల కాగడాలు ఆరిపోయాయి. వాళ్ళు మిగతా వారిని చమురు అడిగారు. వాళ్ళు మాకూ మీకూ ఈ చమురు సరిపోదు. మీరు అంగడికి వెళ్ళి కొనితెచ్చుకోండి అన్నారు. ఐదుగురు అంగటినుండి తిరిగివచ్చే లోపులోనే పెండ్లికుమారుడు రావడమూ వివాహశాలను మూసివేయడమూ జరిగాయి. కనుక వారికి ప్రవేశం లభించలేదు. ప్రభువు రాకడకు ఎప్పుడూ సిద్ధంగానే వుండాలి.

## 68. ముగ్గురు సేవకుల కథ - మత్త 25,14-30

ఒక యజమానునికి ముగ్గురు సేవకులు వున్నారు. అతడు మొదటివానికి ఐదులక్షలు, రెండవ వానికి రెండు లక్షలు మూడవ వానికి

ఒక లక్ష డబ్బిచ్చి ఆ సొమ్ము వృద్ధి చేయండని చెప్పాడు. అతడు తిరిగి వచ్చేటప్పటికి మొదటివాడు పదిలక్షలు గడించాడు. రెండవవాడు నాల్గు లక్షలు ప్రోగుజేశాడు. యజమానుడు ఆ యిద్దరినీ మెచ్చుకొన్నాడు. కాని మూడవవాడు సొమ్ము వృద్ధి చేయక భూమిలో దాచివుంచాడు. అయ్యా! నీవు కచ్చితమైన మనిషివి. విత్తనాలు వేయకుండానే పంట కోయాలని చూచేవాడివి. నీ సొమ్ము భద్రంగా దాచివుంచాను. తీసికో అని చెప్పాడు. యజమానుడు మండిపడి, ఓరీ సోమరిపోతూ! నా సొమ్ము కనీసం వడ్డీకిచ్చిన కొంత పెరిగేది కదా? నీవు చేసిన శ్రమయేదీ అని అడిగాడు. ఆ సొమ్ము తీసికొని మొదటివానికి యిచ్చాడు. దైవరాజ్యంలో ఎవరికృషి వాళ్లు చేయాలి.

## 69. తుది తీర్పు - మత్త 25,31-46

క్రీస్తు న్యాయాధిపతిగా వచ్చి నరులందరికీ తీర్పు తీరుస్తాడు. మంచివాళ్లు అతని కుడిప్రక్కనా, చెడ్డవాళ్లు ఎడమప్రక్కనా నిలుస్తారు. అతడు మంచివాళ్లతో మీరు నా అవసరాల్లో నాకు అన్నపానీయాలు అందించారు. బట్టలిచ్చారు. వ్యాధిలో నన్ను పరామర్శించారు. చెరసాలలో వున్నపుడు దర్శించారు అని చెప్తాడు. వాళ్లు అయ్యా! మేము ఈ సేవలన్నీ నీకు ఎప్పుడు చేశాం అని అడుగుతారు. అతడు మీరు దీనులైన నా సోదరులకు చేసిన సేవలన్నీ నాకు చేసినట్లే గదా అంటాడు. వారికి మోక్షబహుమతిని దయచేస్తాడు.

పిమ్మట అతడు చెడ్డవారితో మీరు నా అవసరాల్లో నాకు అన్నపానీయాలు బట్టలు ఈయలేదు. వ్యాధిబాధల్లో నన్ను పరామర్శించ లేదు. చెరసాలలో వుండగా నన్ను దర్శింపరాలేదు అంటాడు. వాళ్లు కూడ అయ్యా! మేము ఈ సేవలన్నీ నీకు ఎప్పుడు చేయలేదో చెప్పమని అడుగుతారు. అతడు మీరు దీనులైన నా సోదరులకు ఈ సేవలు చేయలేదు కనుక నాకు కూడ చేయనట్లే అంటాడు. వారికి నరక శిక్ష పడుతుంది. మనం అక్కరలో వున్న తోడి జనాన్ని పట్టించుకొన్నామా లేదా అన్నదాన్ని

బట్టి దేవుడు మనకు తీర్పు విధిస్తాడు. తోడి జనానికి చేసిన మంచిగాని చెడ్డగాని తనకు చేసినట్లే భావిస్తాడు.

## 70. శిష్యుల కాళ్లు కడగడం - యోహా 13,1-7

గురువారం శిస్యులు క్రీస్తు ఆజ్ఞ ప్రకారం ఒక నరుని యింటిలో పాస్క భోజనం సిద్ధం జేశారు. అందరూ భోజనానికి కూర్చున్నారు. యేసు పంక్తినుండి లేచి పై వస్త్రం తీసివేశాడు. నడుముకి తుండుగుడ్డ చుట్టుకొని పళ్లెంలో నీరుపోసి శిష్యుల కాళ్లు కడిగాడు. తుండు గుడ్డతో వాటిని తుడిచాడు. పేతురు అడ్డువచ్చి నీవు నా పాదాలు కడగకూడదు అన్నాడు. యేసు ఆలాగైతే నీవు నాకు చెందినవాడవు కావు అని చెప్పాడు. పేతురు అట్లయితే నా చేతులు, తలను కూడ కడుగు అని పల్కాడు. ఆలా అందరు శిష్యుల కాళ్లు కడిగాక ప్రభువు మళ్లా కూర్చుండి నేను మీకు ఈ యా దర్శాన్ని చూపించాను గదా! మీరు కూడ నాలాగే ఒకరి పాదాలు వొకరు కడగాలి సుమా అని చెప్పాడు.

## 71. సత్ప్రసాద స్థాపనం -మత్త 26,26-29

గురువారం ప్రభువు శిష్యులతో అంత్య భోజనం ఆరగిస్తుండగా రొట్టెను తీసికొని ఆశీర్వదించి త్రుంచి శిష్యులకిచ్చి ఇది నా శరీరం మీరందరు దీనిని తీసికొని భుజించండి అని చెప్పాడు. ఆలాగే పాత్రను తీసికొని ఇది పాపపరిహారానికి చిందబడనున్న నిబంధన యొక్క నా రక్తం. మీరందరు దీనిని త్రాగండి అని చెప్పాడు. ఇక్కడ ప్రభువు తన శరీరరక్తాలనే మనకు ఆహారంగా దయచేశాడు.

## 72. యూదా ద్రోహం - లూకా 22,3-6

యూదాకు డబ్బు మీద ఆశ పుట్టింది. యూదనాయకులు క్రీస్తుని చంపడానికి పన్నాగాలు పన్నుతున్నారు. పిశాచం యూదాలోకి ప్రవేశించింది. ఇకనేం, అతడు ఆ నాయకుల వద్దకు వెళ్లి బేరసారాలు ప్రారంభించాడు. వారినుండి ముప్పయి వెండినాణాలు తీసికొని గురువుని పట్టి

యీయడానికి సిద్ధమయ్యాడు. కొద్దిపాటి సొమ్ముకి ఆశపడి అతడు ఏ నాటికి తొలగిపోని కళంకం తెచ్చుకొన్నాడు.

## 73. యూదా ద్రోహాన్ని ఎరిగించడం - మత్త 26,20-25

అంత్యభోజనం సమయంలోనే క్రీస్తు శిష్యులతో మీలో వొకడు నన్ను శత్రువులకు అప్పగిస్తాడు అనిచెప్పాడు. ఆ మాటలకు కలత చెంది శిష్యులు ఒక్కొక్కడు నేనా నేనా అని అడగసాగారు. యేసు నాతోపాటు పాత్రలో రొట్టెను ముంచినవాడు నన్ను అప్పగిస్తాడు. లేఖనాలు వాకొన్నట్లుగా మనుష్యకుమారుడు మరణిస్తాడు. కాని నన్ను అప్పగించే వానికి అనర్థం. అతడు పుట్టకుండ వున్నా బాగుండేది అన్నాడు. అప్పుడు యూదా కూడ నేనా అని అడగ్గా యేసు నీవే చెప్తున్నావు అన్నాడు. అంతకు ముందే యూదా క్రీస్తుని విరోధులకు ముప్పై వెండికాసులకు అమ్మివేశాడు.

## 74. గెత్సెమనిలో ఆవేదనం - మత్త 26,36-46

గురువారం రాత్రి యేసు శిష్యులను తీసికొని గెత్సెమని తోటకు వెళ్లాడు. వారిలో ముగ్గురుని తీసికొని కొంచెం దూరంగా వెళ్లాడు. వారితో నేను మరణవేదనలో వున్నాను. మీరిక్కడే వుండి జాగరణం చేయండి అనిచెప్పి తాను కొంచెం దూరంగా పోయి నేలమీద బోరగిలపడి ప్రార్థన చేశాడు. తండ్రీ! ఈ పాత్రను నా నుండి తొలగించు. ఐనా నీ చిత్తం కాని నా చిత్తం కాదు అని వేడుకొన్నాడు. ఆ పిమ్మట ముగ్గురి దగ్గరికి వచ్చి చూడగా వాళ్లు నిద్రిస్తున్నారు. మీరు కాసేపు నాతోపాటు మేల్కొని వుండలేరా? శోధనకు లొంగకుండ వుండడానికి గాను మేల్కొని వుండండి అని చెప్పాడు.

ఆ పిమ్మట మళ్లా దూరంగా పోయి తండ్రీ! నేను త్రాగిననే తప్ప ఈ పాత్ర తొలగిపోదేని, నీ చిత్తమే నెరవేరనీయి అని జపించాడు. మళ్లా వారి దగ్గరికి వచ్చి శిష్యులు నిద్రిస్తూండడం చూచాడు.

మళ్లా కొంతదూరం పోయి మూడవసారి కూడ అదే ప్రార్థన

చేశాడు. తిరిగి శిష్యుల దగ్గరికి వచ్చి మీరింకా నిద్రిస్తూనే వున్నారా? ఇక లేవండి. పాపులు మనుష్య కుమారుని బంధించడానికి వస్తున్నారు. నన్ను పట్టియిచ్చేవాడు రానే వచ్చాడు. అతన్ని కలసికోవడానికి పోదాం రండి అని చెప్పాడు.

## 75. యేసుని బంధించడం - మత్త 26,47-56

ఇంతలో యూదా యూదనాయకులు పంపిన పెద్దగుంపుతో వచ్చాడు. నేను ముద్దుపెట్టుకొన్న వ్యక్తిని మీరు బంధించండి అని అతడు వారికి ముందుగానే గురుతునిచ్చాడు. అతడు గురువా నీకు శుభం అంటూ క్రీస్తుని ముద్దుపెట్టుకొన్నాడు. వెంటనే ఆ వచ్చిన జనం అతన్ని బంధించారు. పేతురు ఎదురుతిరిగి కత్తి దూసి ప్రధానార్చకుని చెవిని తెగనరికాడు. కాని క్రీస్తు హింస పనికిరాదని చెప్పి పేతురు కత్తిని ఒరలో పెట్టించాడు. అతడు ఆ వచ్చిన జనంతో నేను రోజూ దేవాలయంలో బహిరంగంగా బోదిస్తున్నా మీరు నన్ను పట్టుకోలేదు. లేఖనాలు నెరవేరడానికి ఇప్పుడు మీరు నన్ను ఈలా బంధించారు అని పల్కాడు. ఇదంతా చూచి శిష్యులు భయపడి క్రీస్తుని విడనాడి పారిపోయారు.

## 76. న్యాయపీఠం ఎదుట క్రీస్తు - మత్త 26,57-66

బంధితుడైన యేసుని జనం ప్రధానర్చకుడైన కైఫా వద్దకు కొనిపోయారు. అతడు యూదుల మహాసభను సమావేశపరచాడు. విరోధులు క్రీస్తు మీద ఏమి నేరం మోపుదామా అని ఆలోచించినా వారికి సరైన నేరం దొరకలేదు. కడన ఇద్దరు కూటసాక్ష్యులు ఇతడు దేవాలయాన్ని పడగొట్టి మళ్లా మూడు రోజుల్లో కడతానని పల్కాడు అని చెప్పారు. ప్రధానార్చకుడు క్రీస్తుని జవాబు చెప్పమని అడగ్గా అతడు మౌనంగా వుండిపోయాడు. కైఫా మళ్లా నేను ఒట్టుబెట్టి అడుగుతున్నాను. నీవు మెస్సియావా అని అడిగాడు. క్రీస్తు నీవు అడిగినట్లే. ఇకమీదట మీరు మనుష్య కుమారుడు దేవుని కుడిప్రక్కన కూర్చోవడం చూస్తారు అని జవాబు చెప్పాడు. కైఫా బట్టలు చించుకొని ఇది దేవదూషణం. ఇక సాక్ష్యంతో

అవసరం లేదు. మీ అభిప్రాయం ఏమిటి అని తోడి పెద్దలను అడిగాడు. వాళ్లు ఇతనికి మరణశిక్ష పడాలి అన్నారు. అది యూదుల మహాసభ నిర్ణయం.

## 77. పేతురు బొంకు -మత్త 26,69-27,8

పేతురు కైఫా యింటి వసారాలో మంటదగ్గర కూర్చుండి చలికాచు కొంటున్నాడు. ఓ దాసి నీవు కూడ యేసుశిష్యుడవే కదా అంది. అతడు నాకు తెలియదు అని బొంకాడు. తర్వాత ఇంకో దాసి ఇతడు కూడ యేసు అనుచరుడే అంది. పేతురు అతడెవరో నాకు తెలియదు అన్నాడు. అటు పిమ్మట అక్కడి జనం నీవు కూడ అతని శిష్యుడవే. నీ మాటల్లోని యాసే నిన్ను పట్టియిస్తుంది అన్నారు. పేతరు మళ్లా అతన్ని నేను ఎరుగను అని వొట్టు బెట్టి చెప్తున్నాను అన్నాడు. అంతలోనే కోడి కూసింది. కోడి కూయక మునుపే నీవు నన్నెరుగనని ముమ్మారు బొంకుతావని క్రీస్తు చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకొని పేతురు వెలుపలకు వెళ్లి పుట్టెడు దిగులుతో ఏడ్చాడు.

యూదా యేసుకి మరణ శిక్ష పడ్డం చూచి చింతించి ముప్పది నాణాలు ప్రధానర్చకుల దగ్గరికి తెచ్చి నేను నిరపరాధిని అప్పగించి పాపం కట్టుకొన్నాను. మీ సొమ్ము మీరు తీసికోండి అని అడిగాడు. వాళ్లు ఆ విషయం మాకు పట్టదు. అది నీ సమస్యకాని మా సమస్య కాదు అన్నారు. యూదా ఆ సొమ్ము దేవాలయంలో విసరికొట్టి వెళ్లిపోయి నిరుత్సాహంతో ఉరివేసికొన్నాడు. యాజకులు ఆ సొమ్ముతో పరదేశీయుల భూస్థాపనానికి కుమ్మరివాని పొలం కొన్నారు. కనుకనే దానికి నెత్తురు పొలం అని పేరువచ్చింది.

## 78. పిలాతు మరణశిక్ష విధించడం -లూకా 23,1-25

యూదులకు మరణశిక్ష విధించే హక్కులేదు. కనుక వాళ్లు క్రీస్తుని రాష్ట్రపాలకుడైన పిలాతు వద్దకు తీసికొని వచ్చారు. అతనితో ఇతడు ప్రజలను తిరుగుబాటుకి పురిగొల్పుతున్నాడు. నేనేమెస్సియాను, రాజును

అని చెప్పుకొంటున్నాడు అని చెప్పారు. పిలాతు నీవు యూదుల రాజువా అని క్రీస్తుని అడిగాడు. ప్రభువు నీవే చెప్తున్నావు అని బదులు పల్కాడు. పిలాతు నాకు ఇతనిలో ఏ నేరం కన్పించలేదు అన్నాడు. యూదులు ఇతడు గలిలయనుండి యూదియా వరకు విప్లవం లేవదీస్తున్నాడు అని చెప్పారు.

పిలాతు క్రీస్తుని వదలించుకోగోరి అతన్ని గలిలయ పాలకుడైన హేరోదు దగ్గరికి పంపాడు. ఈ హేరోదు క్రీస్తు అద్భుతాలు చూడాలని కోరికతో వున్నాడు. కాని క్రీస్తు అతనితో మాటలాడక మౌనంగా వుండి పోయాడు. కనుక అతడు క్రీస్తుని మళ్లా పిలాతు దగ్గరికే పంపాడు.

పాస్క ఉత్సవంలో ఒక బందీని విడుదలచేసే ఆచారం వుంది. అప్పుడు బరబ్బ అనే బందిపోటు దొంగ చెరలో వున్నాడు. పిలాతు పండుగ సందర్భంలో క్రీస్తుని విడుదలచేయగోరాడు. కాని యూదులు మాకు బరబ్బను విడుదల చేయమని అరచారు. క్రీస్తుని సిలువవేయమని కేకలువేశారు. పిలాతుకి క్రీస్తునిర్దోషి అని తెలుసు. కాని అతన్ని విడుదల చేస్తే ప్రజలు తిరగబడతారనీ, తన పదవికే గండం వస్తుందనీ దడిశాడు. కనుక క్రీస్తుని మొదట కొరడాలతో కొట్టించి అటుపిమ్మట సిలువ వేయడానికి అనుమతినిచ్చాడు.

యూద సైనికులు క్రీస్తుని తీసికొనిపోయి ఎర్రని అంగీని తొడిగారు. ముళ్ల కిరీటం అల్లి అతని తలమీద పెట్టారు. కుడి చేతిలో వెదురు కర్రను పెట్టారు. అతని ముందు మోకరిల్లి యూదుల రాజా నీకు నమస్కారం అని హేళన చేశారు. అతని మీద ఉమ్మి వేశారు. తలపై మోదారు. అతన్ని సిలువ వేయడానికి తీసికొని పోయారు.

## 79. యేసు సిలువను మోయడం -మత్త 27,32-42

యేసు సిలువను మోసికొని కపాలకొండకు నడచిపోయాడు. నల్గురు రోమను సైనికులు అతన్ని నడిపించుకొని పోయారు. అతనితో పాటు ఇద్దరు దొంగలను కూడ సిలువ వేశారు. ప్రభువు కొరడా

దెబ్బలవల్లా, ఆకలి దప్పులవల్లా, నెత్తురు కారిపోవడం వల్లా అలసిపోయి సిలువను మోయలేక మూడుసార్లు బోరగిల పడ్డాడు. సైనికులు కురేనియా సీమోను అనే అతన్ని బలవంతంచేసి సిలువ మోయడంలో క్రీస్తుకి సహాయం చేయించారు.

దారిలో కొందరు పుణ్యస్త్రీలు క్రీస్తు శ్రమలను జూచి రొమ్ము బాదుకొని సంతాపం తెలియజేశారు. కాని ప్రభువు వారితో మీరు నా కొరకు దుఃఖించవద్దు. మీకు గొప్ప ఆపద రాబోతుంది అని చెప్పాడు.

ఇద్దరు దొంగల్లోవొకడు నీవే మెస్సీయావైతే ఇప్పుడునిన్ను నీవు రక్షించుకొని మమ్ము కూడ రక్షించు అని క్రీస్తుని నిందించాడు. కాని రెండవ దొంగ మొదటి వాణ్ణి మందలించి మనం మన నేరాలకు తగిన శిక్ష అనుభవిస్తున్నాం. ఇతడు ఏ నేరం చేయలేదు అన్నాడు. అతడు యేసు వైపు తిరిగి అయ్యా! నీవు నీ రాజ్యంలో ప్రవేశించినపుడు నన్ను కూడ జ్ఞాపక ముంచుకో అని మనవి చేశాడు. ప్రభువు నేడే నీవు నాతోపాటు పరలోకంలో వుంటావు అని చెప్పాడు.

క్రీస్తుకి చేదు కలిపిన ద్రాక్షరసం తాగడానికి యిచ్చారు.కాని యేసు దాన్ని త్రాగలేదు. సైనికులు చీట్లువేసి అతని వస్త్రాలను పంచు కొన్నారు. వాళ్లు యేసు కాళ్లు చేతుల్లో చీలలు దిగగొట్టి అతన్ని సిలువ మీదికెత్తారు. ప్రభువు సిలువమీద మంటికీ మింటికీ మధ్య వ్రేలాడుతున్నాడు. పిలాతు యూదులరాజైన యేసు అని విలాసం వ్రాయించి సిలువమీద పెట్టించాడు. లతీను, గ్రీకు, హీబ్రూ భాషల్లో ఆ విలాసం వ్రాయించారు. యూద నాయకులూ మరి కొందరూ అతన్ని దూషించారు. నీవు దేవుని కుమారుడ వైతే సిలువమీది నుండి దిగిరా. అప్పుడు మేము నిన్ను విశ్వసిస్తాం అని హేళన చేశారు.

సిలువ క్రింద యేసు తల్లి మరియ, ఇతర పుణ్యస్త్రీలు, యోహాను నిల్చుండి వున్నారు. ప్రభువు తన తల్లిని యోహానుకు తల్లిగాను, యోహానుని ఆమెకు కుమారునిగాను సమర్పించాడు.

మధ్యాహ్నం నుండి మూడు గంటల వరకు చీకట్లు క్రమ్ముకొన్నాయి. మూడుగంటల సమయాన యేసు నా దేవా! నీవు నన్నెందుకు విడనాడావని అరచాడు. ఆ పిమ్మట నాకుదాహం వేస్తుంది అన్నాడు. ఒక సైనికుడు అతనికి పులిసిన ద్రాక్షరసం అందించాడు. ఆ తర్వాత యేసు అంతా సమాప్తమైంది. తండ్రీ! నీ చేతుల్లోకి నా ఆత్మను సమర్పిస్తున్నాను అని పల్కి ప్రాణాలు విడిచాడు.

## 80. యేసు భూస్థాపనం - యోహా 19,31-42

యేసుచనిపోయింది శుక్రవారం సాయంత్రం. శనివారం పవిత్రమైన పాస్కపండుగవచ్చింది. కనుక శవాలను సిలువమీది నుండి వెంటనే దించాలనుకొన్నారు. అందుచే దొంగల కాళ్లు విరగొట్టి వాళ్లు త్వరగా చనిపోయేలా చేసి వారి శవాలను దించారు. క్రీస్తు దగ్గరికి వచ్చిచూడగా అతడు అప్పటికే చనిపోయి వున్నాడు. కనుక అతని కాళ్లు విరగగొట్టలేదు. ఒక సైనికుడు అతని ప్రక్కను బల్లెంతో పొడిచాడు. వెంటనే నెత్తూరు, నీరూ స్రవించాయి.

తర్వాత అరిమత్తయియా యోసేపూ నికొదేమూ క్రీస్తు దేహాన్ని సిలువమీది నుండి దించి పరిమళద్రవ్యాలు పూసి నారబట్టతోచుట్టిపెట్టారు. కపాల కొండకు దగ్గరలో యోసేపుకి ఓ తోటవుంది. దానిలో రాతిలో తొలిపించిన సమాధి వుంది. క్రీస్తు దేహాన్ని ఆ సమాధిలో వుంచి దాని ద్వారాన్ని బండతో మూసివేశారు.

యూదులు పిలాతు అనుమతితో శిష్యులు వచ్చి క్రీస్తు దేహాన్ని దొంగిలించుకొనిపోకుండ వుండేలాగు, సమాధికి కాపలా పెట్టించారు. దాని ద్వారానికి ముద్ర కూడ వేశారు.

## 81. ప్రభువు ఉత్థానం - మత్త 28,1-15

ఆదివారం వేకువన ప్రభువు సమాధి నుండి సజీవుడై లేచాడు. మగ్దల మరియ, ఇతర పుణ్యస్త్రీలు క్రీస్తుదేహానికి లేపనం చేయడానికి

సమాధి దగ్గరకు వచ్చారు. దేవదూత దిగివచ్చి మూతగా వున్నరాతిని దొర్లించి దానిమీద కూర్చున్నాడు. అతన్ని చూచి కావలివారు భయపడి పారిపోయారు. దూత ఆ స్త్రీలతో యేసు ఉత్థానమయ్యాడు. మీరు వెళ్లి శిష్యులకు ఈ విషయం తెలియజేయండి అని చెప్పాడు. ఆ స్త్రీలు వెళ్తూండగా ఉత్థాన క్రీస్తు వారికి కన్పించి గలిలయలో తన్ను కలుసుకోవాలని శిష్యులకు చెప్పమని ఆదేశించాడు.

ఇక్కడ కావలివాళ్లు ప్రధానార్చకుల దగ్గరికి పోయి జరిగిన సంగతంతా తెలియజేశారు. ఆ నాయకులు వారికి లంచం పెట్టి మీరు శిష్యులు వచ్చి రాత్రివేళ యేసు శరీరాన్ని దొంగిలించుకొని పోయారని చెప్పండి అని ఆదేశించారు. కావలివాళ్లు ఆలాగే చేశారు.

## 82. పేతురు, యోహాను సమాధిని దర్శించడం - యోహా 20,1-40

ఆదివారం ఉదయం మరియ మగ్దలీన సమాధి దగ్గరికి వెళ్లి రాయి తొలగింపబడి వుండడం చూచింది. ఆమె పేతురు యోహానుల దగ్గరికి వెళ్లి యేసుదేహం సమాధిలో లేదని చెప్పింది. శిష్యులిద్దరూ సమాధి దగ్గరికి పరుగెత్తుకొని వచ్చారు. యోహాను మొదట సమాధిని చేరాడుగాని లోనికి వెళ్లలేదు. తర్వాత పేతురు వచ్చి లోనికి పోయాడు. అక్కడ ప్రేతాన్ని కప్పిన నారవస్త్రాలు కన్పించాయి. తలకు చుట్టిన తుండుగుడ్డను ఒక వైపున మడిచి వుంచారు. అక్కడ ఏమి జరిగింది పేతురికి అర్థం కాలేదు. అతని తర్వాత యోహాను కూడ సమాధిలోకి వెళ్లాడు. అతడు క్రీస్తు ఉత్థానమయ్యాడని నమ్మాడు. ఎందుకంటే దొంగలు వచ్చి దేహాన్ని ఎత్తుకొని పోయినట్లయితే గబగబ వెళ్లేవాళ్లు. తుండుగుడ్డను నిదానంగా మడిచి ప్రక్కనపెట్టరు. కనుక దేహాన్ని దొంగలు ఎత్తుకొని పోలేదు, ప్రభువు నిజంగానే ఉత్థానమయ్యాడు అని తెలిసికొన్నాడు. ఆ పిమ్మట శిష్యులిద్దరు తిరిగిపోయారు.

## 83. మగ్దల మరియకు దర్శనం - యోహా 20-11,18

మరియ శిష్యులకు ఉత్థాన సమాచారం తెలియజేసి మళ్లా సమాధి దగ్గరకు వచ్చి విచారిస్తూ వుంది. అప్పుడు ఇద్దరు దేవదూతలు కన్పించి అమ్మా! నీవు ఎందుకు ఏడుస్తున్నావు అని అడిగారు. మరియ ప్రభువుని ఎవరోఎత్తుకొనిపోయారు అని చెప్పింది. అంతలో యేసు ఆమెకు కన్పించాడు. కాని ఆమె అతడు తోటమాలి అనుకొని అయ్యా! నీవు అతన్ని తీసికొని పోయినట్లయితే ఎక్కడ వుంచావో చెప్పు. నేను వెళ్లి తీసికొని పోతాను అని పల్కింది. యేసు ఆమెను మరియా అని పిల్చాడు. ఆ పిలుపులోనే ఆమె ప్రభువుని గుర్తించి అతని పాదాలకు పెనవేసికొంది. యేసు ఆమెతో నీవు నన్ను ఆలాగే పట్టుకొని వుండిపోవద్దు. పోయి నేను తండ్రివద్దకు వెళ్లి పోతున్నానని శిష్యులతో చెప్పు అని ఆదేశించాడు. మరియ వెళ్లి ఆలాగే తెలియజేసింది.

## 84. ఎమ్మావు శిష్యులకు దర్శనం -లూకా 24,13-35

ఆదివారం ఇద్దరు శిష్యులు ఎమ్మావు నుండి యెరూషలేముకు ప్రయాణం చేస్తూ, క్రీస్తు మరణాన్ని గూర్చి మాట్లాడుకొంటున్నారు. ఉత్థాన క్రీస్తు కూడ వారితో కలసి ప్రయాణం చేశాడు. కాని వాళ్లు అతన్ని గుర్తించ లేదు. ఎవరో బాటసారిలే అనుకొన్నారు. యేసే వారిని పలకరించాడు. వాళ్లు మన ప్రధానార్చకులు యేసుని సిలువ వేశారు. మేము అతడే రాబోయే మెస్సియా అని నమ్మాము. మా పక్షం స్త్రీలు సమాధి దగ్గరికి వెళ్లగా దేవదూతలు అతడు జీవంతో లేచినట్లు చెప్పారు. కాని మేము మాత్రం అతన్ని కంటితో చూడలేదు. మా ఆశలన్నీ అడియాసలయ్యాయి అని చెప్పారు. ప్రభువు వారికి ప్రవక్తల బోధలను ఉదాహరించి మెస్సీయా మొదట శ్రమలు అనుభవించి తర్వాత మహిమను పొందుతాడు గదా అన్నాడు. ఈలా మాట్లాడుకొంటూ సాయంకాలానికల్లా ముగ్గురూ ఎమ్మావుగ్రామన్ని చేరారు. శిష్యులు అయ్యా! చీకటి పడుతుంది.

ఈ రాత్రికి మాయింటిలో వుండిపో అన్నారు. రాత్రి భోజనం చేసేటప్పుడు యేసు రొట్టెను ఆశీర్వదించి త్రుంచి అందరికీ అందించాడు. అప్పుడు ఇద్దరు శిష్యులూ అతడు యేసేనని గుర్తించారు. వెంటనే ప్రభువు మరుగైపోయాడు.  వాళ్లు దారిలో అతడు ప్రవచనాలను ఉదాహరించి చెప్పినప్పుడు మనకు భక్తి పారవశ్యం కలిగింది గదా అనుకొన్నారు. ఆ పిమ్మట వాళ్లు యెరూష లేముకు తిరిగిపోగా అక్కడి వాళ్లు ప్రభువు ఉత్థానమై పేతురుకి కన్పించాడు అని చెప్పుకొంటున్నారు. ఆ యిద్దరు కూడ ప్రభువు దారిలో తమకు దర్శనమిచ్చిన తీరును తెలియజేశారు.

## 85. యెరూషలేములో దర్శనం -యోహా 21,19-29

ఆదివారం సాయంకాలం శిష్యులు ఒక యింటిలో తలుపులు మూసికొని ప్రార్థన చేసికొంటున్నారు. దిడీలున క్రీస్తు ప్రత్యక్షమై మీకు శాంతి కలుగును గాక అని చెప్పాడు. వారికి తనచేతులూ ప్రక్కా చూపించాడు. వారి మీద పవిత్రాత్మను ఊది పాపాలను క్షమించే అధికారాన్ని దయచేశాడు. మీరు వెళ్లి నన్ను బోధించండి అని చెప్పాడు.

అప్పుడు తోమా శిష్యులతో లేడు. ఇతరులు మేము ప్రభువును చూచామని చెప్పినా అతడు నమ్మలేదు. నేను అతని చేతుల్లోని గాయాలను చూస్తేనే గాని నమ్మను అన్నాడు. ఎన్మిది రోజుల తర్వాత శిష్యులందరూ సమావేశమై ఉన్నప్పుడు ప్రభువు మళ్లా కన్పించాడు. తోమాతో నా చేతుల్లోని గాయాల్లోను నా ప్రక్కలోని గాయంలోను నీ చేయి పెట్టి చూడు. సందేహించ కుండ నన్ను నమ్ము అని చెప్పాడు. తోమా నా ప్రభూ! నా దేవా! నేను నిన్ను నమ్ముతున్నాను అని చెప్పాడు. యేసు నీవు నన్ను చూచి నమ్ముతున్నావు. చూడకుండ నమ్మేవాళ్లు మరీ ధన్యులు అని పల్కాడు.

## 86. సరస్సు తీరాన దర్శనం -యోహా 21,1-14

శిష్యులు గలిలయ సరస్సులో చేపలు పట్టడానికి పోయారు. కాని

రాత్రి వారికి ఏమీ దొరకలేదు. వేకువన క్రీస్తు సరస్సు వొడ్డున కన్పించాడు. ఐనా వారు అతన్ని గుర్తు పట్టలేదు. క్రీస్తువారికి కుడిప్రక్కన వలవేయండి అని చెప్పాడు. ఆలాగే వేయగా వల పిగిలేన్ని చేపలు పడ్డాయి. యోహాను క్రీస్తుని గుర్తించి అతడు ప్రభువే అని పల్కాడు. పేతురు పై వస్త్రాన్ని తొడుగుకొని వొడ్డుకు ఈదుకొంటూ వచ్చాడు. ఇతరులు వలను వొడ్డుకి లాగారు. అక్కడ వారికి బొగ్గుల నిప్పు దానిమీద కాలుతూన్న చేప, రొట్టె కనిపించాయి. వారు కొనివచ్చిన చేపలు కొన్నిటిని గూడ ఆ నిప్పుల మీద పెట్టారు. క్రీస్తువారికి చేపలను రొట్టెనూ పంచి యీయగా అందరూ భుజించారు. ఐనా వాళ్ళ క్రీస్తుని నీ వెవరివి అని అడుగలేదు. అతడు ఎవరో వారికి తెలుసు.

## 87. పేతురుకు ఆదేశం -యోహా 21,15-19

భోజనం అయ్యాక ప్రభువు పేతురుని నీవు నన్ను ప్రేమిస్తున్నావా అని అడిగాడు. ఔనని పేతురు జవాబుచెప్పగా క్రీస్తు నీవు నా గొర్రెలను మేపు అన్నాడు. రెండవ పర్యాయం క్రీస్తు అదే ప్రశ్న అడగ్గా పేతురు అదేజవాబు చెప్పాడు. మూడవ పర్యాయం గూడ క్రీస్తు అదే ప్రశ్న అడగ్గా పేతురు మనసునొచ్చుకొని ప్రభూ! నీకు తెలియందేముంది? నేను నిన్ను ప్రేమిస్తున్న సంగతి నీకు తెలుసు అన్నాడు. ప్రభువు ఐతే నా గొర్రెలను మేపు అని చెప్పాడు. ఈలా ప్రభువు అతనికి తన సమాజం మొత్తం మీద సంపూర్ణ అధికారం ఇచ్చాడు. ఇంకా ప్రభువు అతనితో నీవు యువకుడివిగా వున్నప్పుడు నీ యిష్టం వచ్చిన చోటికి పోయేవాడివి. కాని వృద్ధుడవైనప్పుడు మరొకడు నీచేతులు కట్టివేసి నీ కిష్టంగాని చోటికి నిన్ను తీసికొని పోతాడు సుమా అని చెప్పాడు. అనగా పేతురు తనలాగే వేదసాక్షిగా మరణిస్తాడని సూచించాడు. ఆ పిమ్మట పేతురుతో నీవు నన్ననుసరించు అని చెప్పాడు.

## 88. మోక్షారోహణం - అచ 1,1-11

క్రీస్తు ఉత్థానమయ్యాక చాలసార్లు శిష్యులకు కన్పించాడు. అందరికీ సువార్తను బోధించమని చెప్పాడు. పిత పుత్ర పవిత్రాత్మ పేర్ల మీదిగా ప్రజలకు జ్ఞానస్నానం ఈయమని ఆదేశించాడు. పవిత్రాత్మ రాక కొరకు యెరూషలేములో వేచి వుండమని చెప్పాడు. శిష్యులు తనకు సాక్షులుగా వుండాలని ఆజ్ఞాపించాడు. లోకాంతం వరకు తాను శిష్యులతో వుంటానని మాట యిచ్చాడు. నలభై రోజుల తర్వాత వారిని బెతానియా చెంతగల ఒలీవల కొండకు కొనిపోయి ఆశీర్వదించాడు. ఆ పిమ్మట మోక్షారోహణం చేసి తండ్రి వద్దకు వెళ్లిపోయాడు. ఆలా పోతుండగా ఒక మేఘం అతన్ని కప్పి వేసింది. అప్పుడు దేవదూతలు శిష్యులకు కన్పించి యేసు ఇప్పుడు పరలోకానికి పోయినట్లే మళ్లా తిరిగివస్తాడు అని చెప్పారు. శిష్యులు ప్రభువును ఆరాధించి సంతోషంతో యెరూషలేముకి తిరిగి వచ్చారు.

## 89. మత్తీయ ఎన్నిక -అచ 1,15-26

శిష్యులు ఒలీవల కొండనుండి తిరిగిపోయి యెరూషలేములోని మీది గదిలో సమావేశమయ్యారు. అక్కడ క్రీస్తు తల్లి మరియ, మరికొందరు పుణ్యస్త్రీలు ప్రోగయ్యారు. భక్తులు మొత్తం 120 మంది అయ్యారు. అందరూ ప్రార్థనలో మునిగివున్నారు. పేతురు యూదా స్థానంలో మరో శిష్యుని ఎన్నుకొందామని చెప్పాడు. అతడు క్రీస్తు జీవితానికి సాక్షిగా వున్నవాడై వుండాలని కూడ తెలియజేశాడు. యూస్తు బర్సబ్బా యోసేపు, మత్తీయ అనే యిద్దరు వ్యక్తులను ఎంపిక చేశారు. వీరిలో నీ యిష్టం వచ్చిన వానిని ఎన్నుకొమ్మని దేవునికి ప్రార్థన చేసి చీట్లు వేయగా మత్తీయ ఎన్నికయ్యాడు. కనుక అతడు యూదా స్థానాన్ని పూరించాడు.

## 90. పెంతెకోస్తు - అచ 2

క్రీస్తు ఉత్థానమైన తర్వాత 40 రోజులు, మోక్షారోహణం చేశాక 10 రోజులు, మొత్తం 50 రోజులు ముగిశాక యూదుల పెంతెకోస్తు

పండుగవచ్చింది. శిష్యులు ఒక చోట సమావేశమై జపం చేసికొంటూండగా పవిత్రాత్మ వారి మీదికి దిగివచ్చింది. అప్పుడు బలమైన గాలి వీచింది. నాలుకల్లాంటి నిప్పుమంటలు వారిపై వాలాయి. వెంటనే వాళ్లు అన్యభాషల్లో మాటలాడి దేవుణ్ణి స్తుతించారు. అన్యదేశాల్లో వసించే యూద భక్తులు ఆ పండుగకు యెరూషలేము వచ్చారు. వాళ్ళంతా గుమిగుడి శిష్యులు తమ సొంత భాషల్లో మాటలాడ్డం విని విస్తు పోయారు. కాని కొందరు వీళ్లు త్రాగి మత్తెక్కి మాట్లాడుతున్నారని గేలి చేశారు. అప్పుడు పేతురు ఈలా చెప్పాడు. మీరనుకొన్నట్లుగా మేము త్రాగి రాలేదు. ఆత్మ శక్తితో మాటలాడుతున్నాం. మీరు నజరేయుడైన యేసుని సిలువ వేసి చంపారు. కాని తండ్రి అతన్ని జీవంతో లేపాడు. ఈ యేసు తండ్రినిచేరి అతని నుండి ఆత్మను పొంది ఆ యాత్మను మా యందరిపై కుమ్మరించాడు. కనుకనే మేము అన్యభాషల్లో దేవుని గొప్ప కార్యాలను వివరిస్తూ అతన్ని స్తుతిస్తున్నాం. దేవుడు యేసుని మెస్సియా గాను, ప్రభువుగాను నియమించాడు. ఇప్పుడు మీరు మీ పాపాలకు పశ్చా త్తాపపడి యేసు పేరిట జ్ఞానస్నానం పొందండి. అప్పుడు మీరు కూడ మాలాగే ఆత్మను స్వీకరించి రక్షణం పొందుతారు అని చెప్పాడు. జనం అతని పలుకులు విని జ్ఞానస్నానం పొందారు. ఆరోజు 3000 మంది క్రైస్తవ సమాజంలో చేరారు. వారందరూ శిష్యుల బోధవిని వారితో కలసి జీవించారు. రొట్టె విరవడంలో, ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ విధంగా యెరూషలేములో మొదటి క్రైస్తవ సమాజం ప్రారంభమైంది.

## 91. కుంటివానికి స్వస్థత - అచ 3-4

పేతురు యోహాను సాయంకాలం యెరూషలేము దేవాలయానికి వెళ్తున్నారు. అక్కడో కుంటివాడు బిచ్చం అడుగుకొంటున్నాడు. అతడు బిచ్చం కొరకు వారివైపు చూడగా పేతురు నావద్ద వెండి బంగారాలు లేవు. నజరేయుడైన యేసు శక్తితో నీవు లేచి నడువు అని చెప్పాడు.

వెంటనే వాడు లేచి నడచి వారితో పాటు దేవాలయం లోకి వెళ్లాడు. అది చూచి జనం ఆశ్చర్యపోయి పెద్ద గుంపుగా ప్రోగయ్యారు. పేతురు వారికి క్రీస్తుని బోధించాడు. మా శక్తి వలన గాక యేసు క్రీస్తు శక్తి వలననే యితనికి నడక వచ్చింది. జీవనదాతను మీరు సిలువ వేసి చంపారు. ఐనా దేవుడు అతన్ని జీవంతో లేపాడు. ఇప్పుడు మీరు మీ పాపాలకు పశ్చాత్తాపపడి అతన్ని విశ్వసించి రక్షణం పొందండి అని బోధించాడు.

ప్రభువు చనిపోయి మరల వుత్థాన మయ్యాడని పేతురు చెప్తుండగా విని యూదనాయకులు మండిపడ్డారు. వారిని బంధించి చెరసాలలో పెట్టారు. కాని పేతురు బోధవిని ఐదువేలమంది క్రైస్తవ సమాజంలో చేరారు.

మరునాడు ఉదయం యూదనాయకులు మీరు ఏశక్తితో ఈ యద్భుతాన్ని చేశారని ప్రశ్నించారు. పేతురు ఆత్మప్రేరితుడై అధికారులారా! యేసు శక్తితోనే మేము కుంటివాణ్ణి నడిపించాం. యేసు నామం మీదిగానేఅందరికీ రక్షణం లభిస్తుంది. ఇంకెవరివలనా రక్షణం రాదు అని ధైర్యంగా చెప్పాడు. చదువు సంధ్యలు లేని శిష్యులు అంత ధైర్యంగా మాటలాడ్డం చూచి అధికారులు ఆశ్చర్యపోయారు. ఆ మీదట యేసుని గూర్చి బోధించవద్దని వారిని ఖండితంగా ఆజ్ఞాపించారు. ఐతే పేతురు యోహానులువారిని ఎదిరించి మేము మీరు చెప్పినట్లు చేయలా లేక దేవుడు చెప్పినట్లు చేయాలా? మేము కన్నులారా చూచిన విషయాన్ని గూర్చి మాటలాడకుండ వుండాలా అని ప్రశ్నించారు.కుంటివాడు కూడ అక్కడే వున్నాడు కనుక అధికారులు ఆ యద్భుతాన్ని కొట్టి పారేయలేక పోయారు. శిష్యులను శిక్షిస్తే ప్రజలు తిరగబడతారని భయపడ్డారు. కనుక వారిని బెదరించి వదలిపెట్టారు. తర్వాత శిష్యులంతా ప్రోగయి ధైర్యంగా క్రీస్తుని బోధించే శక్తి కొరకు ప్రార్థించారు. వారున్న స్థలం కంపించగా పవిత్రాత్మ వారికి బలాన్ని చేకూర్చింది.

## 92. అననీయ సఫీరాల కథ - అచ 5,1-11

యెరూషలేములో శిష్యులు ఉమ్మడి జీవితం గడుపుతున్నారు. అననీయ సఫీరా అనే దంపతులు పొలంఅమ్మి కూడబలుకుకొని కొంత సొమ్ము దాచుకొన్నారు. అననీయ కొంత మాత్రమే పేతురుకి సమర్పించాడు. పేతురు అతని మోసాన్ని గుర్తించి ఓయి! నీ సొమ్ము మీద నీకు పూర్తి అధికారం వుంది కదా? నీవు  కొంత దాచుకొని దేవునితో అబద్ధమాడావు సుమా అన్నాడు. వెంటనే అననీయ క్రిందబడి ప్రాణాలు విడవగా అతన్ని పాతిపెట్టారు.

అటుపిమ్మట భర్త చనిపోయాడని తెలియక సఫీరా వచ్చింది. పేతురు పొలం అమ్మగా మీకు వచ్చిన సొమ్ము ఇంతేనా అని అడగ్గా ఆమె యింతేనని బొంకింది. పేతురు మీరిద్దరుదేవుని ఆత్మను ధిక్కరించారు. నీ భర్తను కొని పోయిన వాళ్లు నిన్ను కూడ కొనిపోతారు అని పల్కాడు. వెంటనే ఆమె కూడ క్రిందపడి చనిపోగా పాతిపెట్టారు. ఈ సంఘటనను తెలిసికొని క్రైస్తవ సమాజమంతా భయపడింది.

## 93. అపోస్తలులకు శ్రమలు - అచ 5,12-42

అపోస్తలులు అద్భుతాలు చేసి వ్యాధులు నయంజేస్తున్నారు. పేతురు నీడపడినాచాలు వ్యాధి నయమౌతుంది అనుకొని జనం రోగులను అతని దగ్గరికి తీసికొని వస్తున్నారు. యూదనాయకులు అసూయ చెంది అపోస్తలులను చెరలో పెట్టించారు. కాని రాత్రి దేవదూత చెరసాల తలుపులు తెరచి వారిని దేవాలయానికి వెళ్లి బోధించమని ఆజ్ఞాపించాడు. కనుక వాళ్లు వేకువనే దేవళంలో బోధ ప్రారంభించారు. ఉదయాన్నే మహాసభ సభ్యులు ప్రోగై అపోస్తలులు చెరలో లేరనీ, దేవళంలో బోధిస్తున్నారనీ తెలిసికొన్నారు.వారిని సభ యెదుటికి రప్పించారు. ప్రధానయాజకుడు మేము వద్దన్నా వినక మీరు యేసుని గూర్చి బోధిస్తున్నారు. ఈ పట్టణమంతా మీ బోధతో నిండిపోయింది. మీరుఅతని

మరణానికి మమ్ము బాధ్యులను చేస్తున్నారు అని మండిపడ్డాడు. పేతురు ఏ మాత్రం జంకక, మేము నరులకు గాక దేవునికి విధేయులం గావాలి. దేవుడు అతన్ని వుత్థానం జేసి రక్షకునిగా నియమించాడు. ఇందుకు మేమంతా సాక్షులం అని పల్కాడు. అధికారులు అపోస్తలులను చంపివేద్దాం అనుకొన్నారు. కాని గమలియేలు అనే ధర్మశాస్త్ర బోధకుడు వారిని వారించి మీరు నా మాటలు వినండి. ఈ వుద్యమం మానవ ప్రేరితమైతే దానంతట అదే సమసి పోతుంది. దైవప్రేరితమైతే మనం దాన్ని అణచి వేయలేం. పైగా దేవునితో పోరాడినట్లు అవుతుంది. కనుక వేచిచూద్దాం. ఇప్పుడు వారిని వారి యిష్టం వచ్చినట్లుగా బోధించ నీయండి అని చెప్పాడు. అతని సలహాను అందరూ అంగీకరించారు. అధికారులు అపోస్తలులను కొరడాలతో కొట్టించి యేసుని గూర్చి బోధించవద్దని ఆజ్ఞాపించి వదలిపెట్టారు. ప్రభువు కొరకు శ్రమలు పొందడానికి యోగ్యులమయ్యాం గదా అనుకొని సంతోషించి శిష్యులు అక్కడినుండి వెళ్ళిపోయారు.

## 94. ఏడ్గురు సహాయకులు -అచ 6

యెరూషలేములోని క్రైస్తవ సమాజంలో గొడవ యెదురైంది. గ్రీకు భాష మాటలాడే యూదులు తమ వితంతువులకు భోజనం సరిగా అందడం లేదని హీబ్రూ భాష మాటలాడే యూదులు మీద నేరం తెచ్చారు. అపోస్తలులు శిష్యులందరినీ ప్రోగుజేసి మేము వాక్యబోధను వదలివేసి నిత్యావసరాలను తీర్చడంలో మునిగిపోకూడదు. కావున మీలో యోగ్యులైన వారిని ఏడ్గురుని ఎన్నుకొనండి. వాళ్లు భోజనాది విషయాలు చూచు కొంటారు. మేము వాక్యబోధకూ ప్రార్థనకూ సమయాన్ని వినియోగిస్తాం అని చెప్పారు. ఆ రాజీ మార్గానికి అందరూ సమ్మతించి స్తెఫను, ఫిలిప్పు మొదలైన ఏడ్గురు పరిచారకులను ఎన్నుకొన్నారు. అపోస్తలులు వారిపై చేతులు చాచి ప్రార్థన చేసి వారిని పనిలో నియమించారు.

## 95. స్తెఫను మరణం -అచ 6,8-15,54-60

స్తెఫను ఆత్మశక్తితో చాల అద్భుతకార్యాలు చేశాడు. యూదులు అసూయతో అతన్ని బంధించి న్యాయసభ యెదుటికి కొని వచ్చారు. ఇతడు మన దేవాలయానికీ, మోషే ధర్మశాస్త్రానికీ వ్యతిరేకంగా మాటలాడు తున్నాడని కొందరు కూటసాక్ష్యం పలికారు. సభ అధికారులు స్తెఫను వైపు చూడగా అతని ముఖం దేవదూత ముఖంలాగ ప్రకాశిస్తూ వుంది. అతడు మీరు అన్యాయంగా చంపించిన యేసు దేవుని కుడిప్రక్కన నిలువబడి వున్నట్లుగా నాకు కన్పిస్తున్నాడు అని చెప్పాడు. అనగా ఉత్థాన క్రీస్తు తండ్రికి సరిసమానమని అతని భావం. యూదులు ఆ పలుకులను దేవదుషణగా భావించి, స్తెఫనుని నగరం వెలుపలకు నెట్టుకొనిపోయి రాళ్లతో కొట్టారు. అతడు ప్రభూ! నీవు వీళ్లపాపాన్ని మన్నించు నా ఆత్మను స్వీకరించు అనిపల్కి ప్రాణాలు విడిచాడు. సౌలుకూడ అక్కడే వుండి స్తెఫను హత్యను సమర్థించాడు.

## 96. సౌలు క్రైస్తవులను హింసించడం -అచ 8,1-4

స్తెఫను మరణానంతరం యెరూషలేములోని క్రైస్తవులను క్రూరంగా హింసించారు. సౌలు యూదమతానికి వ్యతిరేకంగా క్రైస్తవమతం ప్రారంభించారు అనుకొన్నాడు. అతడు ఇంటింటజొరబడి విశ్వాసులను బయటికి ఈడ్చుకొని వచ్చి చెరలో త్రోయించాడు. చాలమంది విశ్వాసులు యెరూషలేము నుండి పారిపోయి అన్యప్రాంతాలకు వలస పోయారు. కాని వాళ్లు పోయిన తావులన్నిటిలోను సువార్తను బోధించారు. ఈ రీతిగా చాల ప్రదేశాల్లో క్రైస్తవమతం వ్యాప్తి చెందింది.

## 97. ఫిలిప్పు - ఇతియోపియా ఉద్యోగి -అచ 8,26-40

స్తెఫను మరణానంతరం వేదహింసలు ముమ్మరమయ్యాయి. సౌలు ప్రారంభించిన వేదహింసల వలన చెదరిపోయిన విశ్వాసుల్లో ఫిలిప్పు వొకడు. అతడు సమరియా మండలానికి వెళ్లి క్రీస్తుని బోధించాడు.

అద్భుతాలు చేశాడు. అక్కడ చాలమంది అతని బోధ విని క్రీస్తుని అంగీకరించారు. పేతురు యోహాను కూడ అక్కడికి వెళ్లి అచటి భక్తుల విశ్వాసాన్ని బలపరచారు. వారు చేతులు చాచగా అక్కడి భక్తుల మీదికి ఆత్మ దిగివచ్చింది.

దేవదూత ఫిలిప్పుని ఎడారిగుండ గాజాకు పోయే రహదారికి కొనిపోయాడు. అప్పుడు యితియోపియా ఉద్యోగి యెరూషలేము వచ్చి ప్రభువుని సేవించుకొని తన దేశానికి తిరిగిపోతున్నాడు. రథంలో కూర్చుండి యెషయా ప్రవచనం చదువుకొంటున్నాడు. "అతన్ని గొర్రెనులాగ వధ్యస్థానానికి కొని పోయారు. ఐనా అతడు నోరుతెరచి మాటలాడలేదు" అనే వాక్యం దగ్గరికి వచ్చాడు. ఫిలిప్పు అతన్ని సమీపించి నీవు చదువుతూన్న వేదవాక్యం నీకు అర్థమయిందా అని అడిగాడు. ఇతియోపీయుడు ఎవరైన వివరణం చెప్తేనేగాని ఈ వేదభాగం నాకు అర్థం కాదు. గొర్రెవలె కొనిపోబడిన ఈ వ్యక్తి యెవరు? ప్రవక్తా లేక మరొక భక్తిమంతుడా అని అడిగాడు. ఫిలిప్పు రథమెక్కి ఆ వ్యక్తి యేసేనని చెప్పి ప్రభువుని గూర్చి విపులంగా బోధించాడు. అంతలో వాళ్లు దారిలో నీరు కన్పించే చోటికి వచ్చారు. ఆ వుద్యోగి నేను క్రీస్తుని విశ్వసిస్తున్నాను అన్నాడు. ఫిలిప్పు అతన్ని మడుగులోనికి దింపి జ్ఞానస్నానం ఇచ్చాడు. ఆ పిమ్మట దేవుని ఆత్మ ఫిలిప్పుని అక్కడి నుండి ఆజోతుకు కొనిపోయింది. ఇతియోపీయుడు తన సొంత దేశానికి వెళ్లి అక్కడి ప్రజలకు క్రీస్తుని తెలియజేశాడు.

## 98. సౌలు మార్పు చెందడం -అచ 9,1-19

సౌలు యెరూషలేములోని క్రైస్తవులను హింసించడంతో తృప్తి చెందక దమస్కులోని విశ్వాసులను కూడ పట్టుకొని వచ్చి చెరలో పెట్టడానికి అనుమతి పత్రాలను తీసికొని పోతున్నాడు. దారిలోఉత్థాన క్రీస్తు అతనికి పెద్ద వెలుగు రూపంలో దర్శనమిచ్చాడు. సౌలూ! నీవు నన్నెందుకు

హింసిస్తున్నావు అని ప్రశ్నించాడు. నీవెవరివి అని సౌలు అడగ్గా ప్రభువు నేను యేసుని. నగరంలో నీకు అన్ని విషయాలు తెలుస్తాయిఅని చెప్పాడు. ఆ వెల్తురు సౌలుని గ్రుడ్డివాణ్ణీ, బలహీనుణ్ణీ చేసింది. మూడు రోజుల దాక అతనికి కంటి చూపులేదు, అన్న పానీయాలు ముట్టలేదు.

అననీయ అనే భక్తుడు దమస్కులోని క్రైస్తవులకు పెద్ద. ప్రభువు అతనికి దర్శనమిచ్చి నీవు సౌలుదగ్గరికి వెళ్లమని ఆదేశించాడు. కాని అననీయ భయపడి ప్రభూ! అతడు మనకు విరోధి. యెరూషలేములోని క్రైస్తవులను హింసించి, ఇప్పుడు ఇక్కడి విశ్వాసులకుకూడ కీడు చేయడానికి వచ్చాడు కదా అని ప్రశ్నించాడు. ప్రభువు నీవు భయపడకు. ఇప్పుడు సౌలు మారిపోయాడు. అతడు యిస్రాయేలు ప్రజలకు, అధికారులకు, అన్యులకు నన్ను తెలియజేస్తాడు. నా సేవలో చాలాశ్రమలు కూడ అనుభవిస్తాడు. నీవు అతని దగ్గరికి వెళ్లు అని చెప్పాడు.

అననీయ సౌలు దగ్గరికి వచ్చి అతని మీద చేతులు చాపగా అతనికి మరల చూపు వచ్చింది. అతడు అననీయ నుండి జ్ఞానస్నానం పొంది ఆహారం పుచ్చుకొన్నాడు. ఈ దర్శనం వలన క్రైస్తవులను నాశం చేయబూనిన సౌలు మార్పుచెంది క్రైస్తవమతాన్ని వ్యాప్తి చేయడానికి పూనుకొన్నాడు. క్రీస్తు విరోధి క్రీస్తు భక్తుడయ్యాడు.

## 99. గంపలో సౌలు -అచ 9,20-30

సౌలు దమస్కు పట్టణంలో యేసే మెస్సియా అని బోధించాడు. ఇన్నాళ్లు క్రీస్తుని వ్యతిరేకించిన సౌలు ఇప్పుడు క్రీస్తే మెస్సియా అని వాదించడం చూచి యూదులు విస్తుపోయారు. అతన్ని చంపివేయడానికి పథకం పన్నారు. కాని సౌలు శిష్యులు అతన్ని గంపలోకూర్చొబెట్టి గోడమీదిగా అవతలి వైపుకు దింపివేశారు. ఈ రీతిగా తప్పించుకొని అతడు యెరూషలేము చేరాడు. కాని అక్కడి శిష్యులు మొదట సౌలుని నమ్మలేదు. ఐతే బర్నబా సౌలుని అపోస్తలుల దగ్గరికి తీసుకొనిపోయి

క్రీస్తు అతనికి దర్శనమిచ్చిన తీరూ, అతడు దమస్కులో యేసే మెస్సియా అని బహిరంగంగా బోధించిన తీరూ తెలియజేశాడు. సౌలు యెరూషలేములో కూడ యేసే మెస్సియా అని ధైర్యంగా ప్రకటించాడు. అక్కడి యూదులు కూడ సౌలుని చంపడానికి పూనుకొన్నారు.కనుక శిష్యులు అతన్ని సొంత నగరమైన తార్సుకి పంపివేశారు.

## 100. పేతురు తబితను జీవంతో లేపడం-అచ 9,32-42

పేతురు చాల తావుల్లో బోధించి లిద్దా నగరానికి వచ్చాడు. అక్కడ ఎనియా అనే దీర్ఘకాల రోగికి ఆరోగ్యం చేకూర్చాడు. చాలమంది క్రీస్తుని విశ్వసించారు.

ఆ ప్రక్కనే వున్న యొప్ప నగరంలో తబిత అనే భక్తురాలు చనిపోయింది. ఆమె జీవితకాలమంత పేదసాదలకు సహాయం చేసింది. అక్కడి వాళ్లు కబురుపెట్టగా పేతురు యొప్పనగరానికి వచ్చాడు. అతన్ని తబిత శవమున్న గదిలోకి తీసికొని పోయారు. ఆమె చుట్టు చాలమంది విలపిస్తున్నారు. ఆమె తమకు తయారుచేసి యిచ్చిన దుస్తులను కూడ పేతురుకి చూపించారు. అతడు అందరిని గదినుండి బయటికి పంపి ప్రార్థన చేసి తబిత లెమ్మనగానే ఆమె జీవంతో లేచింది. ఈ యద్భుత కార్యాన్ని చూచి చాలమంది ప్రభువుని విశ్వసించారు.

## 101. కొర్నేలి పరివర్తనం -అచ10

కైసరయ అనే పట్టణంలో కొర్నేలి అనే రోమను సైనికాధికారి వున్నాడు. అతడు యూదుల దేవుణ్ణి విశ్వసిస్తూ భక్తిగా జీవించేవాడు. ఒకరోజు దేవదూత అతనికి దర్శనమిచ్చి దేవుడు నీ పుణ్యకార్యాలను మెచ్చుకొన్నాడు. నీవు యొప్ప నగరంలో వున్న పేతురుని పిలిపించు అని చెప్పాడు. కొర్నేలి ఆలాగే యొప్పకు మనుష్యులను పంపాడు.

అక్కడ పేతురు ఇంటిమీద ప్రార్థన చేసికొంటూండగా ఓ దర్శనం కలిగింది. పెద్ద దుప్పటి తెరచుకొని భూమి మీదికి దిగివచ్చింది. దానిలో

అన్ని రకాల జంతువులు వున్నాయి. నీవు వీనిని చంపి తిను అని ఓ స్వరం విన్పించింది. కాని వానిలో యూదులు తినగూడని అపవిత్ర జంతువులు కూడ వున్నాయి. కనుక పేతురు నేను అపవిత్ర మృగాలను తినకూడదు అని జవాబిచ్చాడు. ఆ స్వరం దేవుడు పవిత్ర పరచినవి అపవిత్రమైనవి కావు అని పల్కింది. ఈ దర్శనం అతనికి మూడుసార్లు కన్పించింది. దీని భావమేమిటా అని పేతురు ఆలోచిస్తూండగా కొర్నేలి పంపిన జనం అతని దగ్గరికి వచ్చారు. వారి ఆహ్వానాన్ని అందుకొని పేతురు కొర్నేలి యింటికి వెళ్లాడు. అక్కడ కొర్నేలి స్నేహితులతో, బంధువులతో పేతురు కొరకు వేచివున్నాడు. తనకు కలిగినదర్శనాన్ని పేతురుకి విన్నవించి అయ్యా! మేము నీ సందేశాన్ని వినడానికి సిద్ధంగా వున్నామని చెప్పాడు.

పేతురు ఈలా బోధించాడు. దేవునికి పక్షపాతం లేదు. మంచి ప్రవర్తన కలిగిన నరుణ్ణి ఏ జాతి వాణ్ణయినా దేవుడు అంగీకరిస్తాడు. దేవుడు యేసుద్వారా నరులను రక్షింపగోరాడు. యూదులు యేసుని సిలువవేయగా తండ్రి అతన్ని జీవంతో లేపాడు. అతని మరణోత్థానాలకు మేము సాక్షులం. ఇప్పుడు యేసుని విశ్వసించి పాపాలకు పశ్చాత్తాపపడితే మీరు కూడ రక్షణం పొందుతారు అని పల్కాడు. అతడు ఈలా చెప్తుండగానే పవిత్రాత్మ కొర్నేలి బృందంపై దిగివచ్చింది. పేతురుతో వచ్చిన యూదులు అన్యజాతి వారు కూడ ఆత్మను పొందడం చూచి విస్తుపోయారు. పేతురు కొర్నేలికీ అతని బంధుమిత్రులకూ జ్ఞానస్నానం ఇచ్చాడు. దర్శనంలో కన్పించిన అపవిత్ర జంతువులు అన్యజాతి ప్రజలేనని పేతురు గ్రహించాడు.

## 102. చెరలో పేతురు - అచ 12

మొదటి హేరోదు మనుమడైన హేరోదు అగ్రిప్పు యూదయాకు రాజయ్యాడు. అతడు యోహాను అన్న యాకోబును చంపించాడు.

పేతురుని గూడ చెరలో పెట్టి పాస్కపండుగ తర్వాత చంపించ గోరాడు. క్రైస్తవ ప్రజలు అతనికొరకు ప్రార్థన చేశారు. దాని ఫలితంగా దేవదూత పేతురుని అద్భుతంగా చెరనుండి బయటికి తీసికొని వచ్చాడు. అతన్ని చెరసాల వెలుపల వదలిపెట్టి అదృశ్యమయ్యాడు. పేతురు మార్కు తల్లి యింటికి పోయాడు. రోడా అనే సేవకురాలు తలుపుతీసింది. పేతురు అచట ప్రోగైయున్న విశ్వాసులను కలసికొని అక్కడినుండి రోముకు వెళ్ళిపోయాడు.

పేతురు కన్పించనందున హేరోదు ఆగ్రహం చెంది చెరసాల బంట్రౌతులను చంపించాడు. అతడు కైసరయలో సింహాసనం మీద కూర్చుండి ప్రజలకు ఉపన్యాసం చేశాడు. జనం అతన్ని మెప్పించడానికి నీవు దేవుళ్ళాగ మాటలాడావని పొగడారు. ఆ పొగడ్తకు హేరోదు తబ్బిబ్బు లయ్యాడు. కాని దేవదూత అతన్ని శిక్షించినందున ఘోరవ్యాధితో మరణించాడు.

## 103. పౌలు మొదటి ప్రేషిత యాత్ర - అచ 13-14

ఆత్మప్రేరణపై అంతియొకయలోని సమాజం బర్నబా సౌలులను అన్యజాతివారికి క్రీస్తుని బోధించడానికి పంపింది.వారు మొదట సైప్రసు దీవిలో క్రీస్తుని బోధించారు. ఆ మండలానికి  పాలకుడు సెర్జియ పౌలు. అతడు వాక్యం వినగోరి బర్నబా సౌలులను ఆహ్వానించాడు. కాని బార్ యేసు అనే మాంత్రికుడు సెర్జియకు అడ్డు తగిలాడు. సౌలు అతన్ని కోపించి నీవు గ్రుడ్డి వాడవు ఐపోతావు అని శపించాడు. వెంటనే అతనికి చూపు పోయింది. మండల పాలకుడు శ్రద్ధతో సౌలు బోధను ఆలించాడు. ఈ సంఘటనం నుండి లూకా సౌలుకి పౌలు అనేపేరు మాత్రమే వాడాడు.

పెర్గ వద్ద మార్కు ప్రేషితబృందాన్ని వదలివేసి యెరూషలేముకి తిరిగివచ్చాడు. అటుపిమ్మట పౌలు బర్నబాలు పిసిడియా మండలంలోని అంతియొకయనగరం ప్రవేశించారు. పౌలు అక్కడి ప్రార్థనా మందిరంలో

రెండుసార్లు బోధింపగా చాలమంది ప్రభువుని అంగీకరించారు. కాని యూదులు అసూయతో పౌలు బర్నబాలపై గలాటా లేవదీశారు. స్థానికులను వారిపై పురికొల్పారు. పౌలు మీరు క్రీస్తుని నిరాకరించారు కనుక మేము అన్యజాతి వారి దగ్గరికి వెళ్తామని చెప్పారు. గ్రీకు ప్రజలు చాలమంది క్రీస్తుని అంగీకరించారు.

పౌలు బర్నబాలు అక్కడి నుండి ఇకోనియాకు వెళ్లారు. అక్కడకొందరు పౌలు బోధలు విని క్రీస్తుని విశ్వసించారు. కాని అక్కడకూడ యూదులు అసూయచెంది గలాటా లేవదీసారు. కనుక ఆ బోధకులు ఆ మండలంలోని లుస్త్రకు వెళ్లారు. పౌలు అక్కడ ఓకుంటివానికి నడచే శక్తినిచ్చాడు. కనుక ఆ నగరవాసులు దేవతలు ఈ నరుల రూపంలో దిగివచ్చారని ప్రశంసిం చారు. ఆ పట్టణ పూజారి దేవతలకులాగ వారికి బలి సమర్పించడానికి కూడ పూనుకొన్నాడు. కాని ఆ బోధకులు అతన్ని వారించారు. అంతియొకయ ఇకోనియాలనుండి వచ్చిన యూదులు లుస్త్రలోని జనాన్ని తమవైపు త్రిప్పుకొని పౌలుని రాళ్లతో కొట్టారు. అతడు మరణించాడు అనుకొని పట్టణం వెలుపలికి ఈడ్చివేశారు. పౌలు మరునాడు దెర్బెకు వెళ్లి అక్కడ బోధ చేశాడు.

అటుపిమ్మట ఆ బోధకులు తిరిగి తాము పూర్వం బోధ చేసిన నగరాలను సందర్శించి అచటి విశ్వాసులను ప్రోత్సహించారు. మనం ప్రభువు సేవలో చాల శ్రమలు అనుభవించాలని చెప్పారు. క్రైస్తవ సంఘాలకు పెద్దలను నియమించారు. ఆ పిమ్మట సిరియాలోని అంతియొకయకు తిరిగివచ్చి తమ ప్రేషితసేవను అక్కడి పెద్దలకు వివరించి చెప్పారు. అన్యజాతి వారు క్రీస్తుని అంగీకరించిన రీతిని తెలియజేశారు. ఈ యాత్ర క్రీ.శ. 45-48లో జరిగింది.

## 104. యెరూషలేము మహాసభ - అచ 15

యూదియ నుండి కొందరు బోధకులు అంతియోకయకు వచ్చి

అన్యజాతివారు క్రైస్తవులైనప్పుడు మోషే ధర్మశాస్త్రాన్ని అనుసరించి సున్నతి పొందితేనే గాని రక్షణం లభించదని వాదించారు. పౌలు బర్నబాలు ఈ వాదాన్ని ఖండించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అపోస్తలులు యెరూషలేములో సమావేశం ఏర్పాటు చేశారు. సున్నతి పొందాలనే వాళ్లూ, అక్కర లేదనే వాళ్లు తమవాదనలు విన్పించారు. పేతురు రక్షణం క్రీస్తు ద్వారానే లభిస్తుందని చెప్పాడు. యెరూషలేము సమాజానికి పెద్దయైన యాకోబు అతనితో ఏకీభవించాడు. కనుక అన్యజాతివారు క్రైస్తవులైనపుడు సున్నది పొందనక్కరలేదని నిర్ణయించారు. వాళ్లు అన్యులు విగ్రహాలకు పెట్టిన ఆహారం తినరాదనీ, జారత్వానికి దూరంగా వుండాలనీ, గొంతు పిసికి చంపిన జంతువులను తినరాదనీ మాత్రం ఆజ్ఞాపించారు. ఈ విషయాలను లేఖలతో వచ్చిన దూతల ద్వారా అంతియోకయ సమాజానికి తెలియపరచారు. ఈ సమావేశం క్రీ.శ. 50లో జరిగింది.

## 105. రెండవ ప్రేషిత యాత్ర - అచ 16-18,22

పౌలు తాను పూర్వం వేదబోధ చేసిన నగరాలను మళ్లా దర్శించాలి అనుకొన్నాడు. బర్నబా మార్కుని వెంట తీసికొని పోగోరాడు కాని పౌలు అంగీకరించలేదు. అతడు మొదటి యాత్రలో పెర్గనుండి వెనుకకు వెళ్లిపోయాడు కదా! ఈ విషయమై యిద్దరికీ వాదోపవాదాలు జరిగి విడిపోయారు. బర్నబా ఒక జట్టుగా, పౌలు ఇంకొక జట్టుగా వెళ్లిపోయారు.

పౌలు లుస్త్రలో తిమొతి అనే శిష్యుణ్ణి కలసికొన్నాడు. అతనికి మంచి పేరుంది. తిమొతి తండ్రి గ్రీకు జాతివాడు కావడంచే పౌలు అతనికి సున్నతి చేయించాడు. ఆ మీదట అతడు పౌలుకి నమ్మిన బంటుగా సేవలు చేశాడు.

పౌలు బితూనియా రాష్ట్రంలో వేదబోధ చేయగోరాడు. కాని ఆత్మ అంగీకరించలేదు. త్రోయలో మాసెడోనియా పౌరుడొకడుపౌలుకి కలలో కన్పించి నీవు మా రాష్ట్రానికివచ్చి మాకు బోధచేయమని వేడుకొన్నాడు.

అది దైవచిత్తమని గుర్తించి పౌలు మాసెడోనియా రాష్ట్ర రాజధానియైన ఫిలిప్పికి వెళ్లాడు. శనివారం యూదుల ప్రార్థనా సమావేశానికి వెళ్లి క్రీస్తుని బోధించాడు. అక్కడకు లూదియ అనే అన్యజాతి స్త్రీ వచ్చింది. ఆమె అద్దకం వేసిన పట్టుబట్టలు అమ్ముకొనేది. పౌలు బోధ విని ఆమె క్రీస్తుని విశ్వసించింది. ఇంటిల్లిపాదిగా జ్ఞానస్నానం పొందింది.

ఆ నగరంలో దయ్యం సోకిన స్త్రీ సోదె చెప్పి యాజమానులకు డబ్బు సంపాదించి పెడుతుండేది. ఆమె పౌలు బృందాన్ని చూచి వీళ్లు దైవ సేవకులు, రక్షణ మార్గం తెలియజేసేవాళ్లు అని మాటిమాటికి అరవడం మొదలుపెట్టింది. పౌలు విసుగు చెంది నీవు ఈమెను విడిచి వెళ్లమని దయ్యాన్ని ఆజ్ఞాపించగా అది వెళ్లిపోయింది. దానితో ఆమెకు సోదె చెప్పే శక్తి నశింపగా యజమానులకు ఆదాయం పడిపోయింది. వాళ్లు ఆగ్రహం చెంది పౌలునీ సీలానూ న్యాయస్థానానికి తీసికొని పోయారు. ఈ యూదులు మాకు సమ్మతంగాని ఆచారాలు బోధించి మా ప్రజల్ని అపమార్గం పట్టి స్తున్నారు అని నేరం తెచ్చారు. న్యాయమూర్తులు వారిని కొరడాలతో కొట్టించి చెరలో త్రోయించారు. అర్ధరాత్రిలో పౌలు సీలాలు దేవుణ్ణి స్తుతించి గీతాలు పాడుతూండగా భూకంపం కలిగి చెరసాల తలుపులు తెరుచు కొన్నాయి. ఖైదీల సంకెలలు ఊడిపడ్డాయి. చెరసాల అధికారి మేల్కొని ఖైదీలు పారిపోయా రనుకొని ఆత్మహత్య చేసుకోవానికి పూనుకొన్నాడు. కాని పౌలు అతన్ని వారించాడు. అతడు పౌలు కాళ్లపైబడి రక్షణమార్గం తెలియజేయమని వేడుకొన్నాడు. పౌలు నీవు క్రీస్తుని విశ్వసించమని చెప్పాడు. అతడు పౌలు బోధ విని కుటుంబ సమేతంగా జ్ఞానస్నానం పొందాడు. తర్వాత పౌలు సీలాలు లూదియా యింటిలో ప్రోగయిన విశ్వాసులను ప్రోత్సహించి ఫిలిప్పీని వీడి తెస్సలోనిక నగరానికి వెళ్లారు. అక్కడి ప్రార్థనా మందిరంలో యెసే మెస్సీయా అని మూడుసార్లు బోధింపగా చాలమంది విశ్వసించారు.

కాని యూదులు అసూయ చెంది పౌలు మీద గలాటా లేవదీశారు. అతనికి ఆశ్రయమిచ్చిన యాసోనుని చెరలో పెట్టించారు. పౌలు సీలాలు అక్కడి నుండి బెరయాకు వెళ్లి ప్రార్థనా మందిరంలో క్రీస్తుని బోధించారు. అచటి ప్రజలు విశాలహృదయులు. పౌలుబోధను సావధానంగా విని అతడు చెప్పింది నిజమా కాదా అని తెలిసికోడానికి పరిశుద్ధ గ్రంథాన్ని పరిశీలించి చూచారు. అక్కడ గూడ చాలమంది క్రీస్తుని విశ్వసించారు. కాని తెస్సలోనిక యూదులు అక్కడికి కూడ వెళ్లి జనాన్ని రెచ్చగొట్టి పౌలుబోధకు ఆటంకం కలిగించారు. పౌలు అక్కడినుండి ఆతెన్సు నగరానికి వెళ్లాడు.

అక్కడి యూదుల ప్రార్థనా మందిరంలోను సంతవీధుల్లోను బోధించాడు. ఆ నగర పౌరులకు క్రొత్త విషయాలు తెలిసికోవాలనే కోరిక ప్రబలంగా వుండేది. కనుక అక్కడి తత్వవేత్తలు అతన్ని అరియోపగ అనే తమ మహాసభకు తీసికొని పోయారు. ఆ నగరంలో అజ్ఞాత దేవునికి ఓ బలిపీఠం ఉంది. పౌలు ఆ యజ్ఞాత దేవుణ్ణి గూర్చే నేను మాటలాడు తున్నానని చెప్పి ఉపన్యాసం ప్రారంభించాడు. దేవుడు క్రీస్తుని ఉత్థానం చేశాడని చెప్పాడు. గ్రీకు ప్రజలు ఉత్థానాన్ని నమ్మరు. కనుక అక్కడివాళ్లు పౌలుని ఎగతాళి చేసి మేము ఇంకోసారి నీ బోధ వింటాంలే అన్నారు. ఆ నగరంలో ఇద్దరు ముగ్గురు మాత్రం ప్రభువుని విశ్వసించారు. ఇక్కడ పౌలు విఫలుడయ్యాడు.

అతడు ఆతెన్సు నుండి కొరింతుకు వెళ్లాడు. అక్కడ అక్విల ప్రిసిల్ల దంపతులతో కలసి జీవించాడు. వాళ్లందరూ గుడారాలు తయారు చేసేవాళ్లే. పౌలు మొదట యూదులకు బోధించినా వాళ్లు వినలేదు. అటుపిమ్మట గ్రీకు ప్రజలకు బోధింపగా వాళ్లు విన్నారు. కొరింతులో ప్రభువు అతనికి దర్శనమిచ్చి ఈ నగరంలో నా భక్తులు చాలమంది వున్నారు. నీవు బోధ ఆపవద్దు. నేను నీకు సహాయం చేస్తాను అని

చెప్పాడు. యూదులు న్యాయస్థానంలో పౌలు మీద ఫిర్యాదుతెచ్చారు గాని అది వీగిపోయింది. పౌలు కొరింతు నుండి అంతియోకయకు తిరిగివచ్చాడు. ఈ యాత్ర క్రీ.శ. 51-54లో జరిగింది.

## 106. మూడవ ప్రేషిత యాత్ర - అచ 19-20

మూడవ ప్రేషిత యాత్రలో పౌలు ఎఫెసు పట్టణానికి వచ్చాడు. అది ఆసియా రాష్ట్రానికి రాజధాని. అక్కడ స్నాపక యోహాను జ్ఞానస్నానం పొందిన భక్తులు కొందరున్నారు. వారింకా ఆత్మను స్వీకరించలేదు. పౌలువారికి క్రీస్తు పేరిట జ్ఞానస్నానమిచ్చి వారిపై చేతులు చాచగా ఆత్మ దిగివచ్చింది. అతడురెండేండ్లు ఎఫెసులో వాక్యబోధ చేయడం వల్ల అందరూ క్రీస్తుని తెలిసికొన్నారు. అక్కడ పౌలు చాల అద్భుతాలు చేసి రోగుల వ్యాధులు కుదిర్చాడు. అతన్ని తాకినా రుమాలలు అంటించినా సరే రోగులకు వ్యాధులు నయమయ్యేవి, దయ్యాలు పారిపోయేవి.

స్కేవ అనేవాని ఏడ్గురు కుమారులు పౌలు బోధించే యేసు పేరిట నీవు వెళ్లిపొమ్మని ఓ దయ్యం పట్టినవాడి దయ్యాన్ని ఆజ్ఞాపించారు. కాని వాడు ఆ యేడ్గురిపై తిరగబడి వారిని చితకబాదాడు. వాళ్లు బట్టలువిడచి పారిపోయారు. కనుక వారి ప్రయత్నం విఫలమైంది. పౌలుబోధమాత్రం బాగా ప్రచారంలోకి వచ్చింది. మాంత్రికులు అనేకులు తాము వాడుకొనే విలువైన మాంత్రిక గ్రంథాలను తగలబెట్టారు.

ఎఫెసు నగరానికి అర్తెమి అనే దేవత, ఆ దేవత పేరుమీదిగా సుప్రసిద్ధ దేవాలయమూ వున్నాయి. దెమిత్రి అనే కమసాలి ఈ దేవత గుడి బొమ్మలు తయారు చేసి అమ్మి లాభాలు గడించేవాడు. పౌలు విగ్రహాలు దేవుళ్లు కాదని బోధించడంచే అతని వ్యాపారం పడిపోయింది. కనుక అతడు తోడిపనివారిని ప్రోగుచేసికొని వచ్చి పౌలు మీద తగాదాకు దిగాడు. వాళ్లు పౌలు అనుచరులను బంధించి ఓ నాటకశాలకు కొనిపోయి

అర్తెమి మహాదేవత అని బిగ్గరగా అరవసాగారు. అక్కడ పెద్ద గుంపు ప్రోగయ్యింది. అసలు సమస్య యేమిటో ఎవరికీ అంతుబట్టలేదు. అప్పుడు ఆనగరాధికారి వచ్చి ప్రజలను శాంతపరచాడు. అర్తెమి గొప్ప దేవతే. దెమిత్రి న్యాయస్థానంలో పౌలు మీద నేరం విన్పించవచ్చు. రాష్ట్ర పాలకుడు ఇప్పుడు మీరు చేసే గందరగోళాన్ని సహింపడు అని చెప్పాడు. దానితో ప్రజలు శాంతించి వెళ్లిపోయారు. దెమిత్రి సంక్షోభం అంతటితో ముగిసింది.

పౌలు అక్కడి నుండి త్రోయకు వెళ్లాడు. అక్కడ రాత్రి చాలసేపు ఉపన్యసించాడు. యూతికు అనే యువకుడు కిటికీలో కూర్చుండి ఆ బోధవింటూ కునికిపాటువల్ల పైయంతస్తునుండి క్రిందపడి మరణించాడు. కాని పౌలు అతన్ని జీవంతో లేపాడు. పౌలు త్రోయనుండి మిలేతుకి వచ్చాడు. ఎఫెసు పెద్దలు ప్రోగైవచ్చి అక్కడ పౌలుని కలసికొన్నారు. అతడువారికి ఈలా బోధించాడు. నేనిప్పుడు యెరూషలేముకి వెళ్లబోతున్నాను. అక్కడ నా కొరకు ఏమి యాపదలు కాచుకొని వున్నాయో నాకేతెలియదు. మీరు నన్ను మరలకంటితో చూడరు. దేవుడు మీకుఅప్పగించిన మందను జాగ్రత్తగా కాపాడండి. నేను వెళ్లిపోయాక క్రూరమైన తోడేళ్లు మిమ్ము బాధిస్తాయి. నేను మిమ్ము దేవుని సంరక్షణకు అప్పగిస్తున్నానుఅని చెప్పాడు. ఆ పిమ్మట అందరూ సముద్రం వొడ్డున మోకాళ్లూని ప్రార్థన చేశారు. పెద్దలు కన్నీరు కారుస్తూ పౌలుని ఓడదాక సాగనంపారు. ఈ యాత్ర క్రీ.శ. 55-56లో జరిగింది.

## 107. అగబు ప్రవక్త - అచ 21,7-14

పౌలు మూడవ ప్రేషితయాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణంలో కైసరయ చేరుకొని ఫిలిప్పు ఇంటిలో మకాము చేస్తున్నాడు. అప్పుడు అగబు అనే ప్రవక్త అక్కడికి వచ్చి పౌలు నడికట్టును తీసికొని దానితో తన కాళ్లు చేతులు కట్టివేసుకొన్నాడు. ఈ త్రాడు ఎవరిదోఅతన్ని యెరూషలేములో

యూదులు ఈలాగే బంధించి రోమీయులకు అప్పగిస్తారు అని ప్రవచనం చెప్పాడు. ఆ ప్రవచనాన్ని విని అక్కడి వాళ్లు యెరూషలేము వెళ్లవద్దని పౌలుని బతిమాలారు. కాని అతడు నేను బందీనై యేసు కొరకు ప్రాణాలు అర్పించడానికీ కూడ సిద్ధంగా వున్నాను అని పల్కాడు. ఆ ప్రజలు అతని ప్రయత్నాన్ని మార్చలేకపోయారు.

## 108. పౌలు చరమదశ - అచ 21-28

పౌలు యెరూషలేము చేరుకొని అక్కడి సమాజానికి పెద్దయైన యాకోబును కలసికొన్నాడు. ఆ పిమ్మట దేవాలయానికి వెళ్లాడు. అక్కడి యూదులు అతన్ని చూచి రెచ్చిపోయి ఇతడు మన ధర్మశాస్త్రానికీ దేవాలయానికీ వ్యతిరేకంగా మాటలాడుతున్నాడు. అన్యజాతి వారిని దేవళం లోనికి తీసుకొచ్చాడు. ఇతన్ని వధించండి అని అరచి పౌలుమీద పడి చంప బోయారు. కాని రోమను సైన్యాధిపతి వచ్చి పౌలుని కోటలోనికి తీసికొని పోయాడు.

పౌలుని చంపిందాకా అన్నపానీయాలు ముట్టమని నలబైమంది యూదులు శపథం చేసి సమయం కొరకు కాచుకొని వున్నారు. ఈ సంగతి పౌలు మేనల్లుడు పసికట్టి సైన్యాధిపతికి తెలియజేశాడు. అతడు పౌలుని రాత్రిలో రహస్యంగా కైసరయలోవున్న రాష్ట్రపాలకుని వద్దకు పంపాడు. అతనికి జాబుకూడ వ్రాశాడు. ఆ పాలకుడు ఫేలిక్సు

పౌలు రాష్ట్రపాలకుని ఆధీనంలో వుండగా యెరూషలేమునుండి యూదనాయకులు వచ్చి అతని మీద నేరాలు మోపారుకాని రుజువు చేయలేకపోయారు. పౌలు రెండేండ్లు కైసరయలో చెరలో వున్నాడు. ఫేలిక్సు పౌలుతో మాటలాడి అతని బోధను విన్నాడు. పౌలు నుండి లంచం తీసికొని అతన్ని విడిపింపగోరాడు. కాని పౌలు లంచం ఈయలేదు. అటు తర్వాత ఫేలిక్సు మారిపోయి ఫెస్తు రాష్ట్రపాలకుడుగా వచ్చాడు.

యూద నాయకులు మళ్లా ఫెస్తు దగ్గరికి వచ్చి పౌలుని

యెరూషలేముపంపి అక్కడ విచారణ జరిపింపవలసిందిగా అర్థించారు. కాని పౌలు నేను రోమను పౌరుణ్ణి. నన్ను రోములో రోమను చక్రవర్తే విచారించాలని పట్టుపట్టాడు. యెరూషలేములో తనకు న్యాయం జరగదని పౌలుకి తెలుసు. ఫెస్తు అంగీకరించాడు.

యూలి అనే సైన్యాధిపతి ఆధీనంలో పౌలు ఓడనెక్కి రోముకు ప్రయాణమయ్యాడు. కాని దారిలో కౌదా అనే నగరం దగ్గర వోడ తీవ్రమైన తుఫానులో చిక్కుకొంది. అందరూ ప్రాణాలమీద ఆశ వదలుకొన్నారు. పౌలుకి ఓ దేవదూత దర్శనమిచ్చి ఓడలోని వారెవరూ చనిపోరని అభయమిచ్చాడు. పదిహేను రోజుల తుఫాను తర్వాత ఓడ యిసుకదిబ్బలో దిగబడి బ్రద్దలై పోయింది. ఓడలోని 276 మంది ప్రయాణికులు సురక్షితంగా వొడ్డు చేరుకొన్నారు. అదే మాల్టా దీవి.

అప్పుడు చలిగా వున్నందున ఆ దీవివాసులు ఆగంతుకులకు చలిమంట వేశారు. పౌలు మంటలో వేయడానికి కొన్ని పుల్లలు ఏరుకొని రాగా ఓ విషసర్పం అతని చేతికి చుట్టుకొంది. కాని అతడు చేయి విదిలించగా అది మంటలో పడింది. అక్కడి జనం పౌలునేరగాడై వుంటాడనీ సముద్రాన్ని తప్పించుకొన్నా పాముకాటుని తప్పించుకోలేడనీ, న్యాయమేతీర్పు చెప్తుందనీ భావించారు. కాని అతనికి ఏహాని కలగక పోవడం చూచి అతడు నిజంగా దేవుడు అనుకొన్నారు. అక్కడ పుబ్లియు అనే ప్రముఖుడు వున్నాడు. అతడు ఆగంతుకులకు మూడు రోజుల పాటు భోజనం పెట్టాడు. అతని తండ్రి జబ్బుగా పడివుండగా పౌలు వ్యాధి నయం జేశాడు. ఇతర రోగులుకూడ వచ్చి జబ్బులు నయం జేయించుకొన్నారు. అక్కడి ప్రజలు పౌలుకీ అతని అనుచరులకూ భోజన పదార్థాలు ఇచ్చి ఆదర పూర్వకంగా సాగనంపారు.

పౌలు మళ్లా మాల్టాలో వోడనెక్కి పుతోలిలో దిగి అక్కడి నుండి కాలి నడకన రోము చేరుకొన్నాడు. ఆ ప్రాంతంలోని విశ్వాసులు దారి

పోడుగున అతన్ని ఆదర పూర్వకంగా ఆహ్వానించారు. అతడు రోములో ఓ అద్దెయింటిలో వసించాడు. కాని ఒక సైనికుడు అతనికి నిరంతరం కాపలా కాశాడు.

మూడు రోజులు కడచిన పిమ్మట రోములోని యూదుల పెద్దలు పౌలుని చూడ్డానికి వచ్చారు. అతడు ప్రాత నిబంధనం నుండి ఉదాహరణలు చూపి యూదులు నిరీక్షిస్తున్న మెస్సీయా యేసేనని వారికి బోధించాడు. ఆ పెద్దలకు అతని పట్ల ఏ దురభిప్రాయంలేదు. కనుక అతని బోధను సావధానంగా విన్నారు. వారిలో కొందరు అతని వాదనను అంగీకరించారు. కొందరు తిరస్కరించారు. వారిలో వారు తీవ్రంగా చర్చించుకొని వెళ్లిపోయారు. రెండేండ్ల పాటు పౌలు అక్కడే వుండి తన్ను చూడవచ్చిన వారి కందరికీ నిరాటంకంగా క్రీస్తుని బోధించాడు. ఇంతటితో అపోస్తలుల చర్యల గ్రంథం ముగుస్తుంది. ఆ మీదట పౌలుకి ఏమి జరిగిందో ఎవరికీ రూఢిగా తెలియదు.

కొందరు బైబులు పండితుల అభిప్రాయం ప్రకారం, పౌలుకి రోమను చెరనుండి విముక్తి లభించింది. అతడు మళ్లా కొంతకాలం పాటు క్రీస్తుని బోధించాడు. ఆ మీదట నీరో చక్రవర్తి క్రైస్తవులను హింసించడం ప్రారంభించాడు. ఆ హింసల్లో పౌలుని కూడ రెండవసారి రోములో బందీని చేశారు. క్రీ.శ. 67 ప్రాంతంలో అతడు అక్కడే వేదసాక్షిగా మరణించాడు. ఇంచుమించు అదే కాలంలో పేతురునికూడ రోములో సిలువ వేశారు.